మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు
దినపత్రిక
NETI EVARTHALU

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 21-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 172 Issue: 172

21 డిసెంబర్ 2025 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:45 సూర్యాస్తమయం - సా. 5:43 తిథిః పాడ్యమి ఉ. 9:10 వరకు తరువాత విదియ సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం పూర్వాషాఢ తె. 3:260 వరకు తరువాత ఉత్తరాషాఢ యోగం వృద్ధి సా. 4:29 వరకు కరణం బవ ఉ. 9:10 వరకు బాలవ రా. 10:01 వరకు వర్జ్యం ఉ. 11:51 నుండి మ. 1:36 వరకు దుర్ముహూర్తం సా. 4:15 నుండి సా. 4:59 వరకు రాహుకాలం సా. 4:20 నుండి సా. 5:43 వరకు యమగండం మ. 12:14 నుండి మ. 1:36 వరకు గుళికాకాలం మ. 2:58 నుండి సా. 4:20 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:09 నుండి తె. 5:57 వరకు అమృత ఘడియలు రా. 10:20 నుండి రా. 12:05 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:52 నుండి మ. 12:36 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com







# గుడ్డు.. వెరీ బ్యాడ్!

## రుచి, పచి లేని ఫారం కోడి గుడ్లు

## బలం రాదు.. పైగా కొత్త రోగాలు..

ఈ రోజు గుడ్డు తిన్నారా? ఆమ్లెట్ టేస్ట్‌గా అనిపించిందా? లేక ఏదో తేడా కొట్టిందా? కోళ్లకు ఇచ్చే మందులు, గుడ్డు ద్వారా మీ పొట్టలోకి వెళ్తన్నాయని భయమేస్తోందా? అంటే ఈ ప్రశ్నలే సగటు గుడ్డు తినే వ్యక్తులను తొలస్తున్న ప్రశ్నలు. గుడ్డు తిందామంటే రుచి ఉ ండటం లేదు. కొన్నిసార్లు గంటల తరబడి ఉ డకబెట్టినా లోపలి నీలం ఉడకదు. నీలం ఉడికినా ఏదో వాసన. సరే పోనీ తిందాం అనుకుంటే.. పిండి పిండి, చప్పిడి రుచి.

(ఈవార్తలు ప్రత్యేకం)

'సండే లేక మండే.. రోజూ తినండి గుడ్డు' అనేది ఒకప్పటి స్లోగన్. కానీ, ఇప్పుడు ఆ గుడ్డు పెంకు పగలగొట్టాలంటేనే భయమేస్తోంది. ఒకప్పుడు ఆమ్లెట్ వేస్తే ఇల్లంతా ఘుమఘుమలాడేది. కానీ, ఇప్పుడు మనం తింటున్న కోడిగుడ్లకు రుచి, పచి లేకుండా పోయింది. ఆకలి తీర్చుకోవడానికి తింటున్నామే తప్ప, ఆరోగ్యం కోసం కాదన్న భావన ప్రజల్లో బలపడుతోంది. ఒకప్పుడు కోళ్లు పెరట్లో సహజంగా దొరికే ఆహారాన్ని, గింజలను తిని గుడ్లు పెట్టేవి. వాటిలో పోషకాలు, రుచి అద్భుతంగా ఉండేవి. కానీ, నేడు పౌల్ట్రీ పరిశ్రమలో లాభాలే ధ్యేయంగా కోళ్లను పెంచుతున్నారు. సహజమైన గింజలకు బదులు, కోళ్లు త్వరగా పెరగడానికి, ఎక్కువ గుడ్లు పెట్టడానికి కృత్రిమ దాణా, హార్మోన్ల మందులు ఇస్తున్నారు. సూర్యరశ్మి తగలని బోన్లలో బంధించి పెంచడం వల్ల గుడ్డులోని పచ్చసొన లేత పసుపు రంగులోకి మారిపోయి, రుచిని కోల్పోతోంది. పౌల్ట్రీ ఫారాల్లో కోళ్లకు వ్యాధులు రాకుండా విచ్చలవిడిగా యాంటిబయాటిక్స్ వాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మందుల అవశేషాలు గుడ్ల ద్వారా మనుషుల శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. దీనివల్ల మనలో తరువాయి 2 వ పేజీలో...

Sunday Special Story
సండే స్పెషల్ స్టోరీ



### నీచు వాసన వస్తోంది

మార్కెట్లో దొరికే తెల్ల గుడ్లు ఉడకబెట్టినప్పుడు ఒకరకమైన నీచు వాసన వస్తున్నాయి. తినబుద్ధి కావడం లేదు. నాటు గుడ్లు దొరకడం లేదు. గత్యంతరం లేక వీటినే తింటున్నాం.

- జాహ్నవి, గృహిణి

### ఇంజెక్షన్ల వల్లే ఈ సమస్య

పెరిగిన జనాభాకు తగ్గట్లు మార్కెట్‌లో కోడి గుడ్ల లభ్యత మంచిదే. కానీ, వ్యాపారులు స్వలాభం కోసం ఇష్టమొచ్చినట్లు ఇంజెక్షన్లు ఇస్తున్న సందర్భాలున్నాయి. దాంతో కోడిగుడ్లలో నాణ్యత తగ్గిపోతోంది. చాలా మంది ప్రజలు ఇదే విషయాన్ని చెప్తున్నారు. అధికారులు గుడ్ల నాణ్యతపై దృష్టి సారించాలి. సామాన్యుడికి అందుబాటులో ఉన్న ఏకైక పౌష్టికాహారం కూడా దూరమయ్యే ప్రమాదం ఉంది

- శ్రీహర్ష, న్యూట్రిషనిస్టు



## పది రోజుల్లో అక్రిడిటేషన్ల జీవో

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

వచ్చే ఏడాది స్థలాల కేటాయింపుపై కబురు

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటన

2

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,418 |
| వెండి (గ్రాము): | రూ.226 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,535 |

### విశ్వవాణి



అమెరికాలో మైనర్ల జెండర్ మార్పిడి శస్త్రచికిత్సలు ఎక్కువవుతున్న తరుణంలో ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 18 ఏళ్లలోపు వారికి ట్రాన్స్‌జెండర్ చికిత్సలు చేయడంపై నిషేధం విధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు.

# రేవంత్‌ను ఫుట్‌బాల్ ఆడతా

## సీఎంకు హనీమూన్ ముగిసింది.. ఇక ప్రజల్లోకి అధినేత కేసీఆర్

### రేవంత్, రాహుల్‌లే ఐరన్ లెగ్‌లు

### రేవంత్ ఢిల్లీ ఇల్లు బీజేపీ ఎంపీ రీమోడల్

### 2028లో బీఆర్ఎస్ అధికారం పక్కా

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

'రేవంత్ రెడ్డి ఎవరితో ఫుట్‌బాల్ ఆడుకుంటాడో నాకు తెలియదు.. నేను మాత్రం రేవంత్ రెడ్డిని ఫుట్‌బాల్ ఆడుకుంటా'నని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేవంత్ ఇంట్లో ఉన్న మహిళలు, పిల్లలు, మనువడి గురించి మాట్లాడనని తెలిపారు. రేవంత్ రెడ్డి మాదిరి కుటుంబసభ్యుల విషయంలో చిల్లర రాజకీయాలు చేయనని స్పష్టం చేశారు.



హైదరాబాద్, డిసెంబర్ 20 (ఈవార్తలు): హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం సాయంత్రం మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అన్ని విషయాలపై కేసీఆర్ రేపు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ మెంబర్ షిప్ మొదలవుతుందని కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి సర్కార్‌కు హనీమూన్ ముగిసిందని.. ఇక కేసీఆర్ ప్రజల్లోకి వస్తారని వెల్లడించారు. కేసీఆర్ బహిరంగ సభలపై ఆదివారం నాటి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మీడియా అడిగిన ప్రశ్నకు కూడా కేటీఆర్ సమాధానమిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆఫీసులోనే ప్రెస్‌మీట్ పెట్టి బీఆర్ఎస్‌లోనే ఉన్నామనడం పెద్ద కామెడీ అని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ 66 శాతం స్థానాల్లో గెలిచినట్లు రేవంత్ రెడ్డి తరువాయి 2 వ పేజీలో...



# హైదరాబాద్‌కు కేసీఆర్

### నందినగర్ ఇంటికి చేరిక.. నేడు తెలంగాణభవన్‌లో భేటీ.. త్వరలో బహిరంగ సభలు!

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సుదీర్ఘ విరామం తర్వాత హైదరాబాద్ నగరానికి చేరుకున్నారు. గత కొంతకాలంగా ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్‌కే పరిమితమైన ఆయన, శనివారం నందినగర్‌కి విచ్చేశారు.

బంజారాహిల్స్/హైదరాబాద్, డిసెంబర్ 20 (ఈవార్తలు): కేసీఆర్ రాకతో తెలంగాణ భవన్‌తో పాటు ఆయన నివాసం వద్ద సందడి నెలకొంది. ఈ క్రమంలో పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో కేసీఆర్ వరుస భేటీలు నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై పార్టీ శ్రేణులకు ఆదివారం కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. తమ అధినేత మళ్లీ తరువాయి 2 వ పేజీలో...




2

# గిల్ అవుట్.. ఇషాన్ ఎంట్రీ

### వైస్‌కెప్టెన్‌కు మొండిచేయి



# మీ వల్లే ఓడాం

## గెలవాల్సిన చోట ఓడగొట్టారు

## రెబల్స్‌ను బుజ్జగించలేకపోయారు

## బంధుప్రీతితో పార్టీకి నష్టం చేశారు

### 18 మంది ఎమ్మెల్యేలపై రేవంత్ సీరియస్!

పంచాయతీ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు రావడంతో 18 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. శనివారం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన సమీక్ష చేపట్టారు. ఈ క్రమంలో పలు జిల్లాల నేతలకు సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. వరంగల్, పాలమూరు, నల్గొండ జిల్లాల ఎమ్మెల్యేలకు పీసీసీ క్లాస్ ఇచ్చినట్టు తెలిసింది. 18 మంది ఎమ్మెల్యేల పనితీరుపై అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం.

హైదరాబాద్, డిసెంబర్ 20 (ఈవార్తలు): ఎన్నికల సందర్భంగా రెబల్స్‌ను బుజ్జగించకపోవడం, సొంత బంధువులకు టికెట్ ఇచ్చి పార్టీకి నష్టం చేశారంటూ సీరియస్ అయినట్టు తెలిసింది. కాగా, భవిష్యత్‌లో ఇది రిపీట్ అయితే ఉరుకునేది లేదని సీఎం రేవంత్ వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. మరోవైపు.. ఆదివారం మధ్యాహ్నం పీసీసీ చీఫ్, మంత్రులతో సీఎం లంచ్ మీటింగ్ ఉండనుంది. పంచాయతీ ఎన్నికల ఫలితాలను నేతలు విశ్లేషించుకోనున్నారు. మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై సీఎం చర్చించనున్నారు. అలాగే, అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. మూడు విడతల్లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సుమారు 56 శాతం స్థానాలను కైవసం చేసుకుంది. రాష్ట్రంలోని మొత్తం 31 జిల్లాల్లో ఎన్నికలు జరగగా.. ఒక్క సిద్దిపేట జిల్లా మినహా మిగిలిన 30 జిల్లాల్లో కాంగ్రెస్ అనుకున్న ఆధిక్యాన్ని సాధించలేకపోయింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,733 పంచాయతీ సర్పంచి పదవులకు గాను.. తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

21.12.2025

మేషం: ఆదాయం అంతంత మాత్రంగా ఉంటుంది. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. దైవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వృధా ఖర్చులు పెరుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి.

వృషభం: సోదరులతో వివాదాలు పరిష్కారమౌతాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులలో పురోగతి సాధిస్తారు. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగస్తులకు అనుకూల వాతావరణం ఉంటుంది. సంఘంలో విశేషమైన ఆధరణ పెరుగతుంది.

మిధునం: కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. నిరుద్యోగుల కష్టం ఫలించింది నూతన అవకాశాలు అందుకుంటారు. వ్యాపార విస్తరణకు పెట్టుబడులు సమకూరుతాయి. ఉద్యోగాలు ఉత్సాహవంతంగా సాగుతాయి. సన్నిహితుల నుండి కొత్త విషయాలు సేకరిస్తారు. స్థిరస్తి వివాదాలు పరిష్కారమౌతాయి.

కర్కాటకం: కొన్ని వ్యవహారాలలో ఆలోచనలు కలసిరావు. చిన్ననాటి మిత్రులతో అకారణ వివాదాలు ఉంటాయి. బంధు వర్గంతో మాట పట్టింపులు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో నిరాశ తప్పదు. దూర ప్రయాణాలు వాయిదా పడుతాయి. చేపట్టిన పనులలో ప్రతిబంధకాలు ఉంటాయి. నూతన రుణ ప్రయత్నాలు చేస్తారు.

సింహం: ఉద్యోగాలు ఆశించిన రీతిలో రాణించవు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపార వ్యవహారాలు మందగిస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. ఆర్ధిక వ్యవహారాలు అంతంత మాత్రంగా ఉంటాయి.

కన్య: వృత్తి వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహం కలిగి పదోన్నతులు పెరుగుతాయి. నూతన వ్యక్తుల పరిచయాలు భవిష్యత్ కు ఉపయోగపడతాయి. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. సంతానానికి నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

తుల: చిన్ననాటి మిత్రులతో సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. ఉద్యోగాలలో మీ పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. ఇంటాబయట పరిస్థితులు అనుకూలిస్తాయి. వ్యాపారాలు విస్తరిస్తారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు.

వృశ్చికం: బంధు మిత్రులతో ఒక వ్యవహారంలో వివాదాలు తప్పవు. చేపట్టిన పనులు మధ్యలో విరమిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. గృహ వాతావరణం చికాకుగా ఉంటుంది. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఆర్థికంగా కొంత గందరగోళ పరిస్థితులుంటాయి. దూరప్రయాణాలు వీలైనంత వరకు వాయిదా వేయడం మంచిది.

ధనస్సు: ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం మంచిది. సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ సభ్యులు మీ మాటతో విభేదిస్తారు. వృత్తి వ్యాపారాలలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి.

మకరం: ఉద్యోగస్తులకు పదోన్నతుల పెరుగుతాయి. కొన్ని వ్యవహారాలలో సొంత నిర్ణయాలతో ముందుకు సాగడం మంచిది. ఆత్మీయుల నుంచి అందిన శుభవార్త ఆనందం కలిగిస్తుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చూడతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.


కుంభం: ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో సమస్యలు ఉంటాయి. ధన వ్యవహారాలలో ఇతరులకు మాట ఇవ్వటం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలు ఆకస్మికంగా నిర్ణయాలు మార్చు. చేయడం వలన నష్టాలు తప్పవు.

మీనం: వ్యాపారాల్లో ఆశించిన విధంగా రాణిస్తాయి. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. ఉద్యోగస్తులకు పదోన్నతులు పెరుగుతాయి. నిరుద్యోగులకు ఒక వార్త ఊరట కలిగిస్తుంది. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. గృహమున శుభకార్యాల నిర్వహణ పై చర్చలు చేస్తారు.

# గుడ్డు.. వెరీ బ్యాడ్!

మొదటి పేజీ తరువాయి

రోగనిరోధక శక్తి తగ్గుతోంది. చిన్న పిల్లల్లో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతోంది. గుడ్డు తింటే ఆరోగ్యం మాట దేవుడెరుగు.. కొత్త రోగాలు వస్తున్నాయేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.



### తమిళనాడులో తనిఖీలు

కోడిగుడ్లలో నిషేధిత యాంటీబయాటిక్ నైట్రోఫ్యూరాన్ ఉంటోందన్న ఆరోపణల నేపథ్యంలో తమిళనాడులో ఆహార భద్రతాధికారులు స్పందించారు. పరీక్షల కోసం కోడిగుడ్ల శాంపిళ్లను చెన్నై, నామక్కల్ పరీక్ష కేంద్రాలకు పంపారు. దాదాపు 15 కోడిగుడ్ల నమూనాలను సేకరించి, పరీక్ష కోసం పంపినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ సదరన్ రీజనల్ డైరెక్టర్ వీకే పంచమ్ తెలిపారు. నిషేధిత మందులేవీ ఉపయోగించలేదని నిరూపించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఓ ప్రైవేట్ కంపెనీ విక్రయించే కోడిగుడ్లలో నైట్రోఫ్యూరాన్ సమ్మేళనం ఉందనే ఆరోపణలు వస్తున్నాయని వెల్లడించారు. క్యాన్సర్ కారకాల్లో ఒకటిగా పరిగణిస్తున్న నైట్రోఫ్యూరాన్ అనే యాంటీబయాటిక్‌ను కేంద్రం నిషేధించింది. ఆహారాన్ని ఉత్పత్తి చేసే జీవాలపై క్లోరాంఫెనికాల్, నైట్రోఫ్యూరాన్స్ వాడొద్దని స్పష్టం చేసింది. యూరోపియన్ యూనియన్ కూడా ఆహారాన్ని ఉత్పత్తి చేసే జంతువులలో నైట్రోఫ్యూరాన్ వాడకాన్ని నిషేధించింది. దీనివల్ల జన్యులోపాలు, అలర్జీలు, మూత్రపిండాలు, కాలేయం దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతాయి. కాగా, నామక్కల్ తమిళనాడులో కోడిగుడ్లను ఎగుమతి చేసే కేంద్రం. ఈ జిల్లాలో వెయ్యికి పైగా కోడిగుడ్ల ఉత్పత్తి కంపెనీలు పనిచేస్తున్నాయి. అవి ప్రతిరోజూ ఆరు కోట్లకు పైగా కోడిగుడ్లను ఉత్పత్తి చేస్తాయని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ తెలిపింది. ఇక్కడి నుంచే బ్రిటన్, జపాన్ సహా వివిధ దేశాలకు కోడిగుడ్లు ఎగుమతి అవుతున్నాయి.

### మన కోడిగుడ్లు సురక్షితమే: ఎఫ్ఎస్ఎస్ఏఐ

కోడిగుడ్లలో క్యాన్సర్ కారకాలు ఉన్నాయంటూ ఇటీవలి కాలంలో వస్తున్న ఆందోళనలపై కేంద్ర ప్రభుత్వ అధీనంలోని భారత ఆహార భద్రత మరియు ప్రమాణాల ప్రాధికార సంస్థ స్పష్టత ఇచ్చింది. దేశంలో విక్రయించే కోడిగుడ్లు మానవ వినియోగానికి పూర్తిగా సురక్షితమని శనివారం ఒక ప్రకటనలో తేల్చిచెప్పింది. గుడ్ల నాణ్యతపై వస్తున్న ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించేవని, వాటికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని కొట్టిపారేసింది. 2011 ఆహార భద్రతా నిబంధనల ప్రకారం కోళ్ల పరిశ్రమలో, గుడ్ల ఉత్పత్తిలో ఏ దశలోనూ నైట్రోఫ్యూరాన్‌ల వాడకాన్ని కఠినంగా నిషేధించినట్లు గుర్తుచేసింది. నిబంధనల అమలు, పర్యవేక్షణ కోసం మాత్రమే నైట్రోఫ్యూరాన్‌కు కిలోకు 1.0 మైక్రోగ్రామ్ పరిమితి ఉందని, ఇది ప్రయోగశాలల్లో గుర్తించగల అతి తక్కువ స్థాయి అని అధికారులు వివరించారు. ఈ పరిమితి కంటే తక్కువగా అవశేషాలు కనుగొనడం వల్ల ఆరోగ్యానికి ఎలాంటి ప్రమాదం ఉండదని, అది నిబంధనల ఉల్లంఘన కిందకు రాదని స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్ నిబంధనలు అమెరికా, యూరోపియన్ యూనియన్‌లతో సమానంగా ఉన్నాయని పేర్కొన్నారు. సాధారణంగా కోడిగుడ్లు తినడం వల్ల మనుషుల్లో క్యాన్సర్ వస్తుందని చెప్పడానికి శాస్త్రీయ ఆధారాలు లేవని ఎఫ్ఎస్ఎస్ఏఐ పునరుద్ఘాటించింది. ఏదైనా ఒక బ్రాండ్‌కు చెందిన గుడ్లలో ఇలాంటి ఆనవాళ్లు కనపడితే, అది కేవలం ఆ బ్యాచ్‌కు మాత్రమే పరిమితమని, దాని ఆధారంగా దేశంలోని మొత్తం కోడిగుడ్లు ప్రమాదకరమని ముద్ర వేయడం సరికాదని హితవు పలికింది. వినియోగదారులు అనవసరంగా ఆందోళన చెందకుండా, అధికారిక సమాచారాన్ని నమ్మాలని కోరింది. కోడిగుడ్లు సురక్షితమైన, పోషకాలతో కూడిన ఆహారమని మరోసారి స్పష్టం చేసింది.

# రేవంత్‌ను ఫుట్‌బాల్ ఆడతా

మొదటి పేజీ తరువాయి

చెబుతున్నది నిజమైతే.. ఫిరాయింపు ఎమ్మెల్యేలు పది మందితో రాజీనామా చేయించి ఉప ఎన్నికకు రావాలని సవాలు విసిరారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాను ఫెయిల్ కాలేదని కేటీఆర్ తెలిపారు. తాను వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాకే 32 జిల్లా పరిషత్, 136 మున్సిపాలిటీలను గెలిచామని పేర్కొన్నారు. అదే రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక సొంత పార్లమెంట్ స్థానాన్ని కూడా గెలిపించుకోలేకపోయాడని విమర్శించారు. తాను ఐరెన్ లెగ్ కాదని.. రేవంత్ రెడ్డి, రాహుల్‌గాంధీలు ఐరన్ లెగ్‌లు అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పాలనకు పంచాయతీ ఎన్నికల ఫలితాలే సూచిక అని అన్నారు. పంచాయతీ ఎన్నికల దెబ్బకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించదని అన్నారు. మొదట మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తారని తెలిపారు. జీహెచ్ఎంసీల్లో మున్సిపాలిటీల విలీనం సక్రమంగా జరగలేదని ఆరోపించారు. గ్రేటర్‌ను మూడు కార్పొరేషన్లు చేయాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచన అని తెలిపారు. గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు పెట్టాలనే దానిపై ముఖ్యమంత్రికి స్పష్టత లేదని అన్నారు. 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం పక్కా అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ కిట్టీ పార్టీ ఆంటీ మాదిరిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఫార్ములా ఈ కార్ రేస్, కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో ఏమీ లేదని రేవంత్ రెడ్డికి అర్థమైందని అన్నారు. రేవంత్ రెడ్డి దెబ్బకు పరిశ్రమలు ఆంధ్రాకు వెళ్లిపోతున్నాయని తెలిపారు. విరూపాక్ష అనే కంపెనీ కర్నూలుకు వెళ్లిపోయిందని తెలిపారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని.. టైమ్ కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పార్టీపరంగా ఇవ్వమని చెప్పడానికి రేవంత్ రెడ్డి ఎవరని కేటీఆర్ ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం, అసెంబ్లీ ఎన్నికల్లో 30 శాతం సీట్లు బీసీలకే ఇచ్చామని గుర్తు చేశారు. రేవంత్ నుంచి నేర్చుకోవాల్సిన అవసరం తమకేమీ లేదని స్పష్టం చేశారు. మార్కెట్ యార్డులు బీసీలకు ఇచ్చింది మేమే అని తెలిపారు. రాజకీయం వేరే.. విద్య, ఉపాధిలో బీసీలకు ఎందుకు రిజర్వేషన్లు ఇవ్వరని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. అఖిలేశ్ యాదవ్ తమ పాత దోస్త్ అని కేటీఆర్ తెలిపారు. అఖిలేశ్‌ను కలిస్తే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు బాధ ఎందుకు అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా స్వయంగా అన్నారని గుర్తుచేశారు. బీజేపీ ఎంపీ దుబే గృహప్రవేశానికి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు పోయాడో రామచంద్రరావు చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రేవంత్ రెడ్డి విందులు, వినోదాలు ఎవరి ఇళ్లలో జరుగుతున్నాయో తెలుసని అన్నారు. ఢిల్లీ తుగ్లక్ రోడ్డులో రేవంత్ రెడ్డి ఇల్లు రీమోడల్ చేయించిందే బీజేపీ అని తెలిపారు. బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు కాంట్రాక్టులు ఇచ్చిందే రేవంత్ రెడ్డి అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఒక కాలు కాంగ్రెస్‌లో.. మరో కాలు బీజేపీలో ఉందన్నారు. కిషన్ రెడ్డితో అండర్ స్టాండింగ్ ఉంటే.. ఆయన బీఆర్ఎస్‌కు చేసిందేంటో చెప్పాలని డిమాండ్ చేశారు.

## పది రోజుల్లో అక్రిడిటేషన్ల జీవో

### మంత్రి పొంగులేటి ప్రకటన

ఖమ్మం, డిసెంబర్ 20 (ఈవార్తలు): జర్నలిస్టుల చిరకాల వాంఛలైన అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో మంత్రి ఫోన్ ద్వారా జర్నలిస్టులను ఉద్దేశించి ప్రసంగించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోబోయే కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ తుది దశకు చేరుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాబోయే పది రోజుల్లోనే దీనికి సంబంధించిన జీవో విడుదల చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై సీఎం రేవంత్ రెడ్డితో ఇప్పటికే లోతుగా చర్చించామని మంత్రి పేర్కొన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు, న్యాయపరమైన చిక్కుల వల్ల కొంత ఆలస్యమైందని అయితే వాటన్నింటినీ అధిగమించి వచ్చే ఏడాది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం తరపున తీపి కబురు అందిస్తామని ప్రకటించారు. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు.



# హైదరాబాద్‌కు కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

ప్రజల మధ్యకు, పార్టీ ఆఫీసుకు వస్తుండటంతో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. పార్టీ సంస్థాగత మార్పులు, భవిష్యత్తు పోరాటాల గురించి ఒక స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆదివారం నాటి సమావేశంలో పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొననున్నారని తెలుస్తోంది. దీంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల, నదీ జలాల అంశంపై పోరుకు బీఆర్ఎస్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో వీటిపై కేసీఆర్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. అదేవిధంగా మహబూబ్‌నగర్, రంగారెడ్డి సహా మరోచోట బహిరంగ సభలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# మీ వల్లే ఓడాం

మొదటి పేజీ తరువాయి

తుది లెక్కల ప్రకారం కాంగ్రెస్ 7,010 స్థానాల్లో గెలిచింది. బీఆర్ఎస్ మద్దతుదారులు మొత్తం 3,502 స్థానాలు, బీజేపీ 688 స్థానాలను తమ ఖాతాలో వేసుకున్నాయి. మూడు విడతలు కలిపి రాష్ట్ర సగటు పోలింగ్ 85.30 శాతంగా నమోదైంది.



### ఇతర మతాలను కించపరిస్తే శిక్షలు

ఇతర మతాలను కించపరిచేలా మాట్లాడితే శిక్షించే విధంగా చట్టం తెస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సమాజంలో ఎవరి మతాన్ని వారు ఆచరిస్తూనే ఇతర మతాలను గౌరవించుకుంటూ శాంతిని కాపాడుకోవలసిన అవసరం ఉందని, ఇతర మతాలను కించపరిచే వారిని శిక్షించే విధంగా వచ్చే శాసనసభ సమావేశాల్లో చట్టం చేస్తామని అన్నారు. శనివారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులతో పాటు క్రిస్టియన్ పెద్దల సమక్షంలో కేక్ కట్ చేశారు. క్రిస్టియన్ సోదర, సోదరీమణులకు సీఎం క్రిస్మస్ శుభాకాంక్షలు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 7,000 చర్చిలకు పండుగ ఖర్చుల నిమిత్తం మొత్తం 33 కోట్ల రూపాయలను కేటాయించినట్లు తెలిపారు. ప్రతి చర్చికి 30 వేల రూపాయల చొప్పున నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సీఎం ప్రసంగిస్తూ.. రాష్ట్రంలోని క్రైస్తవ మైనార్టీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. డిసెంబర్ నెల కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణ ప్రజలకు ఎంతో ప్రత్యేకమని గుర్తు చేశారు. కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ జన్మించింది డిసెంబర్ నెలలోనే, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, ప్రజా ప్రభుత్వం కొలువుదీరింది కూడా డిసెంబర్ నెలలోనే.. అందుకే కాంగ్రెస్ పార్టీకి డిసెంబర్ నెల ఒక మిరాకిల్ మంత్ అని పేర్కొన్నారు.

# గిల్ అవుట్.. ఇషాన్ ఎంట్రీ

### వైస్‌కెప్టెన్‌కు మొండిచేయి.. టీ20 వరల్డ్ కప్‌కు భారత జట్టు ఎంపిక

టీ20 వరల్డ్ కప్ 2026తో పాటు న్యూజిలాండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. ఈ జట్టు ఎంపికలో ప్రధాన చర్చనీయాంశమైన అంశం శుభ్‌మన్ గిల్‌ను పూర్తిగా జట్టుకు దూరం పెట్టడమే. ఇప్పటివరకు వైస్ కెప్టెన్‌గా కొనసాగిన గిల్‌ను ఆ బాధ్యత నుంచి తప్పించడమే కాకుండా, 15 మంది జట్టులోనూ చోటు ఇవ్వలేదు. గిల్ ఇటీవలి ఫామ్‌పై సెలెక్టర్లు అసంతృప్తిగా ఉన్నారనే విషయం ఈ నిర్ణయంతో స్పష్టమైంది. వికెట్ కీపర్–బ్యాటర్ జితేశ్ శర్మను కూడా ఈసారి పక్కన పెట్టారు. అతని స్థానంలో మంచి ఫామ్‌లో ఉన్న ఇషాన్ కిషన్‌కు అవకాశం కల్పించారు. సంజు శాంసన్ కూడా వికెట్ కీపర్‌గా జట్టులో కొనసాగుతున్నాడు. టీ20 జట్టుకు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా కొనసాగనుండగా, అక్షర్ పటేల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ వంటి ఆల్‌రౌండర్లతో టీమిండియా స్క్వాడ్ చాలా బలంగా ఉంది. బౌలింగ్ విభాగంలో జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్‌లతో పాటు హర్షిత్ రాణాకు కూడా చోటు లభించింది. వాషింగ్టన్ సుందర్, రింకూ సింగ్‌లను కూడా జట్టులో చేర్చడం విశేషం. మొత్తానికి బీసీసీఐ ప్రకటించిన టీమిండియా స్క్వాడ్‌తో టీ20 వరల్డ్ కప్ సందడి అప్పుడే మొదలైంది.

### టీ20 వరల్డ్ కప్ 2026, న్యూజిలాండ్ టీ20 సిరీస్‌కు భారత జట్టు:

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజు శాంసన్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, ఇషాన్ కిషన్ , రింకూ సింగ్.

## విద్య, ఉద్యోగవాణి

### 394 పోస్టుల నోటిఫికేషన్

కంపెనీ: ఇండియన్ ఆయిల్ కర్పొరేషన్ లిమిటెడ్
మొత్తం పోస్టులు: 394
అర్హత: బీటెక్, బీఈ, డిప్లొమా, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి
వయోపరిమితి: 18-26 ఏళ్ల మధ్యగల వారు
పరీక్ష విధానం: రాతపరీక్ష
ఎంపిక విధానం: ఫిజికల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా
దరఖాస్తు చివరి తేదీ: జనవరి 09, 2026
వెబ్‌సైట్: www.iocl.com

# గుడిలోకి అడవొచ్చింది!



## కొండగట్టు గుట్టపై అటవీశాఖ హద్దులు.. హిందువుల మనోభావాలతో సర్కారు ఆటలు

**ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌పై భగ్గుమన్న భక్తులు**

**భూములు అంజన్నవేనని నిరసనలు**

**నిరాహార దీక్షకు దిగిన వీహెచ్‌పీ నేతలు**

**సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం**

**ఆలయ ఈవో శ్రీకాంత్ రావు వెల్లడి**



మల్యాల, డిసెంబర్ 20 (ఈవార్తలు): నాలుగైదు వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయం అది.. తెలంగాణలోనే అతిపెద్ద ఆంజనేయస్వామి ఆలయం.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లాంటి వాళ్లకు సెంటిమెంట్ ఉన్న గుడి.. కానీ, ఇప్పుడు ఆ గుడిలోకి అడవి వచ్చి చేరింది. అదేంటి? గుడిలోకి అడవి రావడం ఏంటి? అని అనుకుంటున్నారా? అటవీ శాఖ అదే బుకాయిస్తోంది మరి. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట శివారులోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పరిసరాలు తమవేనంటోంది అటవీశాఖ. వందల ఏళ్ల నుంచి ఉన్న ఆలయాన్ని, అక్కడ ఉన్న ఉప ఆలయాలను, మంత్రులు, కలెక్టర్ వచ్చి శంకుస్థాపన చేసినప్పుడు గానీ, భవనాలు కట్టినప్పుడు గానీ కిక్కురుమనని అటవీశాఖ.. ఇప్పుడేదో ముగినిపోయిందని ఆగమాగంగా కొండగట్టుకు వచ్చి మార్కు పెట్టి ఆ భూములు తమవేనని చెప్తుండటం గమనార్హం. అటవీశాఖ అధికారులు మార్కు వేసిన ఆలయాల్లో భేతాళ స్వామి అల్లుబండ, ధర్మశాల, బస్టాండు, సాగర్ గెస్ట్ హౌజ్, హరిత హెూటల్, వాహన పూజల షెడ్డు, పార్కింగ్ స్థలం, డార్మిటరీ షెడ్డుతోపాటు ఈవో కార్యాలయ భవనం ఉండటం విస్మయానికి గురి చేస్తోంది. ఈవో కార్యాలయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. నిర్మాణ సమయంలోనూ ఫారెస్ట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయలేదని, ఇప్పుడొచ్చి అవి తమ భూములు అనడం ఏంటని హిందువుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

### అసలేంటీ వివాదం?

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లోని 6 ఎకరాల భూములు అటవీశాఖవేనని ఫారెస్ట్ సిబ్బంది దేవాదాయశాఖ అధికారులతో కొంతకాలంగా వివాదం నడుస్తోంది. వాస్తవానికి దాదాపు 22 ఎకరాల విస్తీర్ణంలో ఆంజనేయస్వామివారి ఆలయం విస్తరించి ఉంది. గుడికి ఆనుకొని మరో 363.22 ఎకరాల భూములు స్వామివారి పేరున ఉన్నాయి. గుట్టల్లో అటవీశాఖకు కూడా 360 హెక్టార్ల విస్తీర్ణంలో రిజర్వ్ ఫారెస్ట్ ఉన్నట్లు గతంలో వెల్లడించారు. కొండగట్టు అర్బన్ పార్కు పేరుతో 8 నెలల క్రితం ఆలయ పరిసరాల్లోని వై జంక్షన్ సమీపంలోని అటవీ ప్రాంతం చుట్టూ ఇనుప జాలీతో ప్రహరీ నిర్మాణానికి పనులు ప్రారంభించడంతో ఆ భూమి దేవస్థానానికి చెందిందని ఆలయ అధికారులు అడ్డుకొన్నారు. దాంతో అసలు వివాదం మొదలైంది.

### హిందువులపై కాంగ్రెస్ సర్కారు కక్ష!

అటవీశాఖ హద్దులు గీయడంపై హిందూ సంఘాలు భగ్గుమన్నాయి. ఎప్పుడూలేనిది కొత్తగా ఇప్పుడొచ్చి అటవీశాఖ హద్దులు గీస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని మండిపడ్డారు. పైగా, ఆలయ ఈవో లేని సమయం చూసి అధికారులు వచ్చి మార్కింగ్ వేయడం అభ్యంతరకరం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కలగజేసుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం వీహెచ్‌పీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. యాగండ్ల లక్ష్మీనారాయణ, బొబ్బిలి వెంకటస్వామి, ముదుగంటి రాజిరెడ్డి, గిరిప్రదక్షిణ కమిటీ సభ్యులు ఆలయం ముందు నిరాహారదీక్షకు దిగి, ప్రభుత్వం వెంటనే అంజన్న భూములు అంజన్నకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటవీశాఖ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఆర్డీవో వెంటనే ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అయితే, సాయంత్రం వరకు పచ్చి మంచి నీళ్లు కూడా ముట్టకపోవడంతో.. నిరాహారదీక్షను విరమించాలని ఈవో వారిని కోరారు. స్థానిక ఎమ్మార్వో కూడా వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం ఆర్డీవో సమక్షంలో ఆలయ భూములపై ఓ నిర్ణయం తీసుకుంటామని ఎమ్మార్వో చెప్పడంతో నిరాహారదీక్షను విరమించారు.



## కొండగట్టులో 97 గదుల టీటీడీ సత్రం

మల్యాల, డిసెంబర్ 20 (ఈవార్తలు): కొండగట్టు అంజన్న ఆలయ సన్నిధిలో రూ.35.19 కోట్లతో 96 గదుల సత్రం, మాల విరమణ మండపం నిర్మాణానికి టీటీడీ ఆమోదముద్ర వేసింది. అందులో భాగంగా శనివారం స్థల సేకరణ కోసం టీటీడీ బోర్డు అధికారులు ఈఈ నరసింహామూర్తి, డిప్యూటీ ఈఈ పీవీ నాగరాజు, ఏఈ జే నాగరాజు, ఏఈఈ మల్మ నాయక్ కొండగట్టుకు విచ్చేశారు. కొండగట్టు ఈవో శ్రీకాంత్ రావు ఆధ్వర్యంలో అనువైన స్థలాన్ని పరిశీలించారు. మరోవైపు, శనివారం అంజన్నకు ప్రీతిపాత్రమైనది కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ అధికారులు సౌకర్యాలు కల్పించారు.

## మీ ఖర్చులేంది? లెక్కలేంది?

**బడ్జెట్ ప్రతిపాదనలు పంపించాలని కోరిన ఆర్థిక శాఖ**

**ఫిబ్రవరి లేదా మార్చిలో బడ్జెట్ ప్రవేశపెట్టే చాన్స్**

హైదరాబాద్, డిసెంబర్ 20 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రంలో బడ్జెట్ కసరత్తు ప్రారంభమైంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూపకల్పనకు తెలంగాణ ఆర్థిక శాఖ శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలను కోరింది. జనవరి 3వ తేదీలోపు ప్రతిపాదనలు పంపించాలని ఆర్థిక శాఖ అన్ని శాఖలకు సూచించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సవరించిన ప్రతిపాదనలు కూడా పంపాలని కోరింది. అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు అందిన తర్వాత, శాఖల వారీగా మంత్రులు, కార్యదర్శులతో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క సమీక్షలు జరిపి బడ్జెట్ కేటాయింపుల అంచనాలపై చర్చిస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చి నెలలో శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుత ఏడాది పన్నుల ద్వారా రూ.1.75 లక్షల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటివరకు లక్ష కోట్ల రూపాయలు వచ్చినట్లు అంచనాలు ఉన్నాయి. మార్చి నాటికి పన్నుల వసూళ్లు బాగా పుంజుకుంటాయని భావిస్తున్నారు.

## ఒకేసారి 80 మంది పోలీసులు బదిలీ

**హైదరాబాద్ సీపీ సజ్జనార్ సంచలన నిర్ణయం**

**కానిస్టేబుల్ నుంచి ఎస్సై వరకు ర్యాంకు అధికారుల అటాచ్**

హైదరాబాద్, డిసెంబర్ 20 (ఈవార్తలు): హైదరాబాద్ నగర సీపీ వీ.సీ. సజ్జనార్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు షాక్ ఇచ్చారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్ పోలీసులపై అవినీతీ ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆయన ఒక్కసారిగా 80 మంది సిబ్బందిని బదిలీ చేశారు. కానిస్టేబుల్ నుంచి ఎస్సై వరకు ర్యాంక్ అధికారులను అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. టాస్క్‌ఫోర్స్ ప్రక్షాళన కోసమే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా టాస్క్‌ఫోర్స్‌లో అధికారులు బదిలీలు లేకుండా ఉన్నారు. ఇటీవలి కాలంలో టాస్క్‌ఫోర్స్ అధికారులపై అవినీతి ఆరోపణలు ఎక్కువయ్యాయి. ఒక నిందితుడిని తప్పించేందుకు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో సీపీ సంచలన నిర్ణయం తీసుకున్నారు.

## ఏసీబీ వలలో వనపర్తి వ్యవసాయ శాఖ అధికారి

**యూరియా సరఫరా కోసం లంచం డిమాండ్**

వనపర్తి, డిసెంబర్ 20 (ఈవార్తలు): వనప జిల్లాలో ఓ అవినీతి అధికారి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వనపర్తి జిల్లా వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న పుప్పాల ఆంజనేయులు గౌడ్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, ఒక రైతుకు యూరియా బస్తాలు సరఫరా చేసేందుకు గాను ఆంజనేయులు గౌడ్ రూ.20,000 లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే బాధితుడి నుంచి రూ.3,000 అడ్వాన్స్‌గా తీసుకున్నారు. మిగిలిన మొత్తంలో నుంచి రూ.10,000 నగదును తీసుకుంటున్న సమయంలో, ముందుగా సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నెంబర్ 1064కు డయల్ చేయాలని తెలిపారు.

## ఈ నెల 26 నుంచి పరిహారం: ఇండిగో




న్యూఢిల్లీ: ఇటీవల విమానాలను భారీగా రద్దు చేసి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఇండిగో ఎయిర్‌లైన్స్, వారికి పరిహారం చెల్లించేందుకు ముందుకొచ్చింది. ఈ నెల 3, 4, 5 తేదీల్లో విమానాశ్రయాల్లో గంటల తరబడి చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఈ నెల 26 నుంచి రూ.10,000 విలువైన ట్రావెల్ వోచర్లను జారీ చేయనుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన రూ.5,000 నుంచి రూ.10,000 పరిహారానికి ఇది అదనం. విమానయాన శాఖ కార్యదర్శి సమీర్ సిన్హా అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అర్హులైన ప్రయాణికులందరికీ తక్షణమే చెల్లింపులు జరిగేలా చూడాలని ఇండిగోను ప్రభుత్వం ఆదేశించింది. నేరుగా ఇండిగో వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకున్న వారికి వారం రోజుల్లోగా చెల్లింపులు ప్రారంభించాలని సమావేశంలో నిర్ణయించారు. ట్రావెల్ ఏజెంట్లు, ఆన్‌లైన్ పోర్టళ్ల నుంచి ప్రయాణికుల వివరాలు సేకరించి, వారికి కూడా నేరుగా పరిహారం అందించాలని ఇండిగోకు సూచించారు. ఈ ప్రక్రియను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఎయిర్ సేవా పోర్టల్ ద్వారా విమానయాన శాఖ పర్యవేక్షించనుంది. రద్దయిన విమానాలకు సంబంధించి ఇండిగో రిఫండ్లు ప్రారంభించినప్పటికీ, ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెన్సీల ద్వారా బుక్ చేసుకున్న చాలా మందికి ఇంకా డబ్బులు అందలేదని తెలుస్తోంది. డీజీసీఏ ఆదేశాలతో మేక్ మై ట్రిప్ సంస్థ ఇండిగో నుంచి డబ్బులు రాకముందే దాదాపు రూ.10 కోట్లు రిఫండ్ చేసినట్లు సమాచారం. మరోవైపు భవిష్యత్తులో ఇలాంటి భారీ వైఫల్యాలు పునరావృతం కాకుండా సమస్య మూలాలను గుర్తించడానికి బయటి సాంకేతిక నిపుణులతో కలిసి పనిచేస్తామని ఇండిగో ఛైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా తెలిపారు. ఈ నెల 8 నుంచి తమ నెట్‌వర్క్‌లోని అన్ని గమ్యస్థానాలకు విమాన సేవలు పూర్తిగా పునరుద్ధరించామని, 9 నుంచి కార్యకలాపాలు సాధారణ స్థితికి వచ్చాయని కంపెనీ పేర్కొంది.

## ఉద్యోగుల కులవివరాలు సమర్పించండి

**పలుశాఖలకు రాష్ట్ర బీసీ కమిషన్ ఆదేశం**

హైదరాబాద్, డిసెంబర్ 20 (ఈవార్తలు): కులాలవారీగా ఉద్యోగుల వివరాలు సమర్పించాలని పలు ప్రభుత్వ విభాగాలను తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆదేశించారు. బీసీలకు సంబంధించిన పలు అంశాలపై ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్, సభ్యులు శనివారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సమావేశంలో కమిషన్ వివిధ అంశాలపై చర్చించింది. సీడ్ పథకం అర్హుల ఎంపికకు డీఎన్టీ(డీ నోటిఫైడ్ ట్రైబ్స్) సర్టిఫికెట్ జారీపై కమిషన్ తరఫున ఢిల్లీలోని డీఎన్టీ బోర్డును సందర్శించిన అధికారుల నుంచి వివరాలు ఆరా తీశారు. నిబంధనల మేరకు రాష్ట్రంలో సంచార జాతులను రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేయాలని, ప్రభుత్వానికి సిఫారసులు చేయాలని కమిషన్ నిర్ణయించింది. ఇటీవల ఎన్నికైన సర్పంచ్, వార్డుమెంబర్ల కుల వివరాలు పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి కోరాలని అధికారులకు కమిషనర్ సూచించారు.

## శాసనసభ, మండలికి వేర్వేరు కార్యదర్శులు

హైదరాబాద్, డిసెంబర్ 20 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శనివారం అసెంబ్లీ, శాసన మండలికి వేర్వేరు కార్యదర్శుల నియమించింది. శాసన సభ కార్యదర్శిగా ఆర్. తిరుపతి నియమితులవ్వగా.. శాసన మండలికి వీ.నరసింహాచార్యులుకార్యదర్శిగా వ్యవహరించనున్నారు. ఎగువ, దిగువ సభలకు విడివిడిగా కార్యదర్శుల నియామకానికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్ర శాసన సభకు సెక్రటరీగా కొనసాగుతున్న డాక్టర్. వీ.నరసింహ చార్యులును మండలికి కార్యదర్శిగా నియమించింది.

## రేవంత్‌కే అబద్ధాల నోబెల్

**మాజీమంత్రి హరీశ్ రావు ఎద్దేవా**



సంగారెడ్డి, డిసెంబర్ 20 (ఈవార్తలు): పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ స్థానాలను కాంగ్రెస్ తన ఖాతాల్లోకి వేసుకుందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. రాజకీయాల్లో అబద్దాలు ఆడడంలో నోబెల్ ప్రైజ్ ఇస్తే అది రేవంత్‌రెడ్డికే ఇవ్వాలని విమర్శించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో గెలిచిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్ల సన్మాన కార్యక్రమానికి హరీష్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎప్పుడైనా లోకల్ బాడీ ఎన్నికల్లో అధికార పార్టీ 90 శాతం గెలిస్తే పది పైసలు ప్రతిపక్ష పార్టీలు గెలుస్తాయి. కానీ బీఆర్ఎస్ 40 శాతం అంటే 4వేలకు పైగా సర్పంచ్ స్థానాలను గెలిచింది. సంగారెడ్డిలో 34 సర్పంచులు గెలిస్తే అందులో 27 గెలిచామని రేవంత్ రెడ్డి చెప్తున్నాడని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ 50 శాతంలోపే సర్పంచులు గెలిస్తే 66 శాతం గెలిచామని రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ముఖానికి ఎరువులు ఇచ్చే తెలివి లేదని అన్నారు.పంట పండాలంటే నీళ్లు కావాలి. కరెంటు కావాలి. ఎరువులు కావాలి.రేవంత్ రెడ్డి ఏమంటున్నాడు అప్పులు కావాలి. మ్యాపులు కావాలి అంటున్నాడు.ఎరువు బస్తాలు కావాలంటే యాప్‌లో కొట్టండి అంటున్నాడు. ఎప్పుడైనా నీ మొఖానికి వ్యవసాయం చేసావా? రైతుల కష్టం మీకు తెలుసా? నని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో కరెంటు ఫుల్. నీళ్లు ఫుల్. ఎరువులు ఫుల్.రేవంత్ రెడ్డి వచ్చినంక రెండుసార్లు రైతుబంధు ఎగ్గొట్టిండు, కరెంటు 14 గంటలు కూడా వస్తలేదు, ఎరువుల కోసం లైన్ లో నిలబడి గోసపడుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ 10, 12 స్థానాలకు మించి గెలవదని తెలిపారు.ప్రజలందరూ మళ్లీ కేసీఆర్ కావాలని ఎదురుచూస్తున్నారని తెలిపారు.

**ధైర్యముంటే కో ఆపరేటివ్ ఎన్నికలు జరపాలి**

మున్సిపాలిటీల పదవి కాలం పూర్తయి సంవత్సరమవుతున్నా ఎన్నికలు పెట్టట్లేదు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఎందుకు పెట్టట్లేదని ప్రశ్నించారు.కోపరేటివ్ ఎలక్షన్ పెట్టమంటే కూడా కాంగ్రెస్ నాయకులను నామినేట్ చేసుకుందామని జీవో ఇచ్చారని హరీష్ రావు వెల్లడించారు. ధైర్యముంటే, రైతులకు మేలు చేసే నాయకుడివి అయితే నామినేటెడ్ కాకుండా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 15వ ఆర్థిక సంఘం డబ్బులు 85 శాతం ఢిల్లీ నుంచి గల్లీకే వస్తాయని ఎవరూ కూడా దానిని ఆపలేరని తెలిపారు. ఏ ప్రజాప్రతినిధికి లేని చెక్ పవర్ సర్పంచ్‌కు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. గెలిచిన సర్పంచులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి సర్పంచ్ విధివిధానాలు, బాధ్యతలపై ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేస్తామన్నారు. మనుమడు సోకు తీర్చడానికి రేవంత్ రెడ్డి వందకోట్లు ఖర్చు చేశాడని, ప్రభుత్వ ఖజానా నుంచి రూ. 5 కోట్లతో ఫుట్‌బాల్ గ్రౌండ్ కట్టించుకున్నాడని మాజీ మంత్రి ఆరోపించారు. ప్రజల సొమ్ముతో జల్సాలు చేయడం కాదని సొంత డబ్బుతో కట్టుకోవాలని సూచించారు. సింగరేణి సీఎస్సార్ డబ్బులతో కేసీఆర్ స్కూళ్లు కట్టించిండు. రోడ్లు ఏసించిండు. మెడికల్ కాలేజీలు పెట్టించాడని అన్నారు. అందాల పోటీలు పెట్టాలి. ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడాలి. గ్లోబల్ సమ్మిట్ పేరుతో సోకులు చేయాలి. ఢిల్లీకి హైదరాబాద్ కి చక్కర్లు కొట్టాలనే ఆలోచన తప్ప రేవంత్ రెడ్డి ప్రజలకు చేసిందేమి లేదని ఎద్దేవా చేశారు.

## నాంపల్లిలో కోర్టుకు సీఎం రేవంత్



నాంపల్లి/హైదరాబాద్,డిసెంబర్ 20 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. గతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం, తిరుమలగిరి, మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసుల విచారణలో భాగంగా ఆయన వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ మూడు కేసులు ప్రధానంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు, పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు, రాజకీయ కార్యక్రమాల సందర్భంలో నమోదైనవి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఈ కేసులు నమోదయ్యాయి. కోర్టులో న్యాయమూర్తి ఎదుట రేవంత్ రెడ్డి ఎగ్జామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. మూడు కేసుల్లోనూ ఈ ప్రక్రియ పూర్తయింది. ముఖ్యమంత్రి హాజరు కావడంతో కోర్టు పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. మీడియా, సామాన్య ప్రజలను కోర్టు హాలు సమీపంలోకి అనుమతించలేదు.

# త్వరలో మళ్లీ తెలంగాణకు అఖిలేశ్?

## సమాజ్‌వాదీ పార్టీ వర్గాల్లో ఊహాగానాలు.. లక్నో సమావేశంలో కీలక నిర్ణయాలు




లక్నో/హైదరాబాద్, డిసెంబర్ 20 (ఈవార్తలు): సమాజ్‌వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ అతి త్వరలో తెలంగాణ పర్యటన చేపట్టే అవకాశం ఉందని పార్టీ విశ్వసనీయ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన 'విజన్ ఇండియా' కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ సాధించడంతో పాటు, తెలంగాణలో అఖిలేశ్ యాదవ్‌కు లభించిన స్పందనపై సోషల్ మీడియా, ప్రధాన మీడియాల్లో విస్తృతంగా చర్చ జరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో, తెలంగాణ సమాజ్‌వాదీ పార్టీ యువ నాయకత్వం పార్టీ భవిష్యత్తుపై అఖిలేష్ యాదవ్‌కు సమగ్ర నివేదిక అందించినట్లు సమాచారం. తెలంగాణలో బీసీ (బ్యాక్‌వర్డ్ క్లాసెస్) రాజకీయ అవగాహన బలంగా ఉందని, కానీ అనేక పార్టీలు బీసీ వాదాన్ని వినిపిస్తున్నప్పటికీ అది సవతి తల్లి ప్రేమలా పరిమితమైపోయిందని నాయకత్వం ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో సమాజ్‌వాదీ పార్టీ కేంద్రీకృత వ్యూహంతో ముందుకెళ్తే, తెలంగాణలో పార్టీకి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని యువ నాయకులు అభిప్రాయపడినట్లు సమాచారం. దీనిపై అఖిలేశ్ యాదవ్ సానుకూలంగా స్పందించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**లక్నోకు తెలంగాణ నాయకత్వం?**

సమాజ్‌వాదీ పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకత్వాన్ని లక్నోకు రావాలని అఖిలేష్ యాదవ్ ఆహ్వానించినట్లు సమాచారం. ఈ సమావేశంలోనే తెలంగాణ పర్యటన తేదీలు, భారీ సభ లేదా సమావేశం నిర్వహించే ప్రాంతం, పార్టీ నిర్మాణం, యువజన విభాగం బలోపేతం, బీసీ, మైనారిటీ, పీడీఏ వర్గాలపై ప్రత్యేక వ్యూహం వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలాగే, తెలంగాణలో పార్టీ నేతలు మరింత క్రమశిక్షణతో, ప్రజల మధ్య పనిచేయాలని, రాజకీయంగా స్పష్టమైన దృక్పథంతో ముందుకు వెళ్లాలని అఖిలేశ్ యాదవ్ హితబోధ చేసినట్లు సమాచారం. మొత్తంగా చూస్తే, సమాజ్‌వాదీ పార్టీ తెలంగాణ రాజకీయాల్లో సీరియస్ ఎంట్రీకి సిద్ధమవుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అఖిలేశ్ తెలంగాణ పర్యటన ఖరారైతే, రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు ఇది దారి తీసే అవకాశం ఉందని భావిస్తున్నారు.



# విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

## గీతాంజలి టాలెంట్ స్కూల్ 23వ వార్షికోత్సవంలో డీసీపీశ్రీనివాస్

కూకట్‌పల్లి/హైదరాబాద్: విద్యార్థులు క్రమశిక్షణ తో మెలుగుతూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని డిసిపి కె. శ్రీనివాస్ సూచించారు. శనివారం కూకట్పల్లిలోని గీతాంజలి టాలెంట్ స్కూల్ 23వ వార్షికోత్సవం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా జరిగింది. దీనికి ముఖ్యబు తిథిగా శ్రీనివాస్ విచ్చేసి, మాట్లాడారు. తల్లిదండ్రులు ఆడ, మగ తేడా లేకుండా తమ పిల్లలను సమానంగా చూడాలన్నారు. బబ్బాయిలకు ప్రాధాన్యం ఇచ్చేదోరణిని వీడాలని సూచించారు. నీతి నిజాయితీ, విలువలతో కష్టపడుతూ కష్టపడుతూ విజయం అందుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. స్కూల్ డైరెక్టర్ శ్రవణ్కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతికతను ఇందిపుచ్చుకొని తమ నైపణ్యలను వృద్ధి చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# మోకాళ్లపై నడిచి.. 80 ఏళ్ల వృద్ధ దంపతుల మొక్కు



మల్యాల, డిసెంబర్ 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో 80 ఏళ్ల వృద్ధ దంపతులు మోకాళ్లపై నడిచి మొక్కు తీర్చుకున్నారు. ముత్యం పేట ఎస్సీ కాలనీ బ్లాక్ ఆఫీస్‌కు చెందిన దుబ్బాక నరసవ్వ, భర్త భూమయ్య శనివారం కొండగట్టులో మోకాళ్లపై నడిచి ఐదు ప్రదక్షిణలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ ముత్యంపేట గ్రామ సర్పంచ్‌గా దారం ఆది రెడ్డి గెలిచిన తర్వాత తన మొక్కు చెల్లించుకుంటానని కొండగట్టు అంజనేయ స్వామికి మొక్కుకున్నానని, అందుకే మొక్కు చెల్లించుకున్నానని తెలిపారు.



# హర్షిత్ పటేల్‌కు స్టేట్ లెవల్ కాంస్యం

జగిత్యాల టౌన్, డిసెంబర్ 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన సబ్ జూనియర్ బాక్సింగ్ క్రీడాకారుడు పాదం హర్షిత్ పటేల్ రాష్ట్రస్థాయిలో కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ నెల 18-19 తేదీలలో హన్మకొండ లో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఎస్‌జీఎఫ్ఐ బాక్సింగ్ పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా హర్షిత్‌ను జగిత్యాల డిప్యూటీ స్పోర్ట్స్ ఆఫీసర్ రవికుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చక్రధర్, జగిత్యాల బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పాదం మహేందర్, సెక్రటరీ గువ్వ శ్రీనివాస్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి, పీఈటీ శ్రీరాం అభినందించారు.



# శ్రీశైలంలో రీల్స్ చేస్తే చర్యలు: ఈవో

శ్రీశైలం, డిసెంబర్ 20 (ఈవార్తలు): భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని దేవస్థానం అధికారులు సూచించారు. ఆలయ పరిధిలో అన్యమత ప్రార్థనలు, బోధనలు, ప్రచారాలు, రీల్స్ చేయడంపై కఠిన ఆంక్షలు విధించినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శ్రీశైలం క్షేత్ర పరిధిలో అన్యమత బోధనలకు సంబంధించిన కరపత్రాలు, పుస్తకాలు పంపిణీ చేయడం నిషేధమని తేల్చి చెప్పారు. ఇలాంటి కార్యకలాపాలు చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. భక్తుల ఆధ్యాత్మిక భావాలను గౌరవిస్తూ ఆలయ పవిత్రతను కాపాడటం కోసమే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. దేవస్థానం అనుమతి లేకుండా ఆలయ ప్రాంగణంలో వీడియోలు తీయడం, డ్రోన్స్ ఎగురవేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వీడియోలు, రీల్స్, ఫొటోలు ప్రచారం చేయడానికీ అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ చర్యలు భక్తుల ప్రశాంతతకు భంగం కలగకుండా ఉండేందుకు, ఆలయ వాతావరణం శాంతియుతంగా ఉండేందుకు తీసుకున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా కఠిన చర్యలు చేపడతామని చెప్పారు. ధూమపానం, మద్యపానం, జూదం ఆడడం, మాంసాహారం వినియోగం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటీవల శ్రీశైలంలో ఓ యువతి రీల్స్ చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో అది కాస్త వివాదాస్పదంగా మారడంతో పాటు ఈ అంశం చర్చకు దారితీసింది. దీనిపై స్పందించిన యువతి తాను తప్పుగా రీల్ చేయలేదని.. తప్పు జరిగిందని భావిస్తే క్షమాపణలు చెబుతున్నట్లు చెప్పింది. కొంతమంది తనను ట్రోల్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు మరోసారి స్పందిస్తూ, భక్తులందరూ ఆలయ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎవరు హద్దులు దాటినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. భక్తుల సహకారంతోనే ఆలయ నిర్వహణ సక్రమంగా సాగుతుందని, అందరూ అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మాజీ అగ్నివీర్‌లకు బీఎస్‌ఎఫ్‌లో 50 శాతం రిజర్వేషన్లు

**మహిళలకు పరిస్థితిని బట్టి ఖాళీల కేటాయింపు**

న్యూఢిల్లీ: సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) కానిస్టేబుల్ నియామకాల్లో మాజీ అగ్నివీర్‌లకు రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం 10 శాతం నుంచి 50 శాతానికి పెంచింది. ఈ మేరకు బీఎస్ఎఫ్ నిబంధనలను సవరిస్తూ కేంద్ర హోం శాఖ శుక్రవారం ఓ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దీని ప్రకారం, మాజీ అగ్నివీర్‌ల కోసం కేటాయించిన 50 శాతం ఖాళీలను నోడల్ ఫోర్స్ మొదటి దశలో భర్తీ చేస్తుంది. రెండో దశలో, మిగిలిన 47 శాతం ఖాళీలను స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ భర్తీ చేస్తుంది. ఈ ఖాళీల్లో మాజీ సైనికుల కోటా 10 శాతం, మొదటి దశలో మాజీ అగ్నివీర్‌లతో భర్తీ కాని పోస్టులు కూడా ఉంటాయి. మహిళా అభ్యర్థుల కోసం ఖాళీలను అంతకు ముందు సంవత్సరంలో పరిస్థితిని బట్టి ప్రతి సంవత్సరం బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నిర్ణయిస్తారు. కార్యకలాపాల అవసరాల ప్రాతిపదికపై ఈ నిర్ణయం జరుగుతుంది. గతంలో అన్ని సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌లోనూ కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) ఉద్యోగాల ఖాళీల్లో 10 శాతం మాజీ అగ్నివీర్‌లకు కేటాయించారు. తాజా నోటిఫికేషన్ కేవలం బీఎస్ఎఫ్ నిబంధనల సవరణలకు మాత్రమే వర్తిస్తుంది. ఇతర కేంద్ర సాయుధ పోలీసు దళాలకు వర్తించదు. ప్రస్తుత నిబంధనల ప్రకారం మాజీ అగ్నివీర్‌లు శారీరక సామర్థ్య పరీక్షల నుంచి మినహాయింపు పొందుతారు. రాత పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది.

# కేరళలో 24 లక్షలకు పైగా ఓటర్ల పేర్లు అదృశ్యం!

తిరువనంతపురం: కేరళలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సమీక్ష(సర్)లో భాగంగా ఎన్యూమరేషన్ దశలోనే 24 లక్షలకు పైగా ఓటర్ల ఆచూకీ తెలియరాలేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రతన్ యూ కేల్కర్ శనివారం వెల్లడించారు. సర్ కార్యకలాపాలను సమీక్షించేందుకు నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్న ఆయన ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సర్ గణాంకాలను వివరించారు. రాష్ట్రంలోని మొత్తం 2.78 కోట్ల ఓటర్లలో 24,08,503 ఎన్యూమరేషన్ ఫారాలు వాపసు రాలేదని ఆయన చెప్పారు. వీరిలో 6,49,885 మంది మరణించినట్లు ఆయన చెప్పారు. 6,45,545 మంది ఆచూకీ తెలియరాలేదని అన్నారు.

# గౌహతిలో శ్రీవారి ఆలయానికి 25 ఎకరాలు



తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి వైభవాన్ని ఈశాన్య భారతదేశంలో మరింత విస్తరించేందుకు టీటీడీ చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా అస్సాం రాష్ట్రంలోని గౌహతి నగరంలో 10.8 ఎకరాల భూమికి బదులుగా 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గౌహతి సమీపంలోని కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో 10.8 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం గతంలోనే అంగీకారం తెలిపింది. డిసెంబర్ 7న అస్సాం ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి కేకే ద్వివేది టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు లేఖ రాస్తూ కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో టీటీడీ వేంకటేశ్వర ఆలయం నిర్మిస్తే, అక్కడ ఉన్న ఆలయ ప్రయోజనాలకు భంగం కలగవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో వేంకటేశ్వర ఆలయాన్ని అస్సాంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సిల్చార్, డిబ్రూగఢ్ నగరాల్లో ఏర్పాటు చేయాలని అస్సాం సీఎం అదనపు ప్రధాన కార్యదర్శి సూచించారు. సిల్చార్ లేదా డిబ్రూగఢ్ బదులుగా అస్సాం రాజధాని గౌహతి లోనే టీటీడీకి 25 ఎకరాల భూమి కేటాయించాలని ఏపీ సీఎం చంద్రబాబు కోరిన మీదట అస్సాం ముఖ్యమంత్రి గువాహటిలోనే ఆలయం ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, అస్సాం ముఖ్యమంత్రులకు టీటీడీ చైర్మన్ బీ.ఆర్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. భూమి కేటాయింపునకు సంబంధించిన విధివిధానాలను పూర్తి చేసి, ఈశాన్య భారతదేశంలో తొలి వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించేందుకు అస్సాం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటామని చైర్మన్ బీ.ఆర్.నాయుడు స్పష్టం చేశారు.

# జగన్‌కు పక్కా ప్లాన్ ఉంది: సజ్జల

తాడేపల్లి, డిసెంబర్ 20 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఎంత మేలు చేయాలో అంతా చేశారని, మళ్లీ అధికారంలోకి రాగానే చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా ఆయనకు స్పష్టమైన ప్రణాళిక ఉందని ఆ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లిలో జరిగిన జగన్ పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి, అనంతరం మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలు జగన్ వెంటే ఉంటారని సజ్జల ధీమా వ్యక్తం చేశారు. “ప్రజలకు మేలు చేసేది జగన్ ఒక్కరేనని కోట్లాది మంది నమ్ముతున్నారు. అందుకే తన ఐదేళ్ల పాలనలో అందరికీ మేలు చేశారు. ఏదో ఆశించి ఆయన సహాయం చేయరు. తన వల్ల ప్రజలకు ఎంత మంచి జరుగుతుందనే నిత్యం ఆలోచిస్తారు” అని తెలిపారు. ఓదార్పు యాత్ర సమయంలోనూ, కరోనా కష్టకాలంలోనూ జగన్ ప్రజలకు అండగా నిలిచిన తీరును సజ్జల గుర్తుచేశారు. జగన్ ఏనాడూ పబ్లిసిటీ కోరుకోలేదని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి కాలనీలు సృష్టించారని, 17 మెడికల్ కాలేజీలు, పోర్టులు, హార్బర్లు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ప్రచారం చేసుకోలేదని అన్నారు. చంద్రబాబు తన 18 నెలల పాలనలోనే రూ.2.70 లక్షల కోట్లు అప్పు చేశారని, కానీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఆర్థికవేత్తలే ఆశ్చర్యపోయేలా జగన్ తన ఐదేళ్ల పాలనను సాగించారని సజ్జల ప్రశంసించారు.



# బంగ్లాదేశ్‌లో దాడులను ఖండించరేం?

విజయవాడ, డిసెంబర్ 20 (ఈవార్తలు): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల పట్ల దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ హింసను ‘నరమేధం’గా అభివర్ణించిన ఆయన, ఈ దాడులను ఖండించని వారు అసలు భారతీయులేనా? అంటూ సంచలన ప్రశ్నలు సంధించారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ, మతం పేరుతో సాగుతున్న ఈ హింస మానవత్వానికే మాయని మచ్చ అని ఆవేదన వ్యక్తం చేశారు. “బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అమానుష దాడులను ఖండించకుండా మౌనంగా ఉన్న రాజకీయ పార్టీలకు, నాయకులకు ఈ దేశంలో కొనసాగే నైతిక హక్కు ఉందా?” అని నిలదీశారు. భారతదేశం సహనానికి, మత సామరస్యానికి ప్రతీక అని, అలాంటి దేశంలో ఉంటూ ఈ దాడులపై స్పందించకపోవడం దేశభక్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఇది కేవలం ఒక దేశ సమస్య కాదని, అంతర్జాతీయ మానవ హక్కుల ఉల్లంఘన అని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. బాధితుల పక్షాన నిలబడకుండా మౌనం పాటించడం అనైతికమని, ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించడమేనని అన్నారు.

# గొప్పోళ్లకు కులానికి పరిమితం చేస్తారా?

**పొట్టి శ్రీరాములును ఒక కులానికి పరిమితం చేయడంపై పవన్ ఆవేదన**

**ఉభయగోదావరి జిల్లాల్లో అమరజీవి జలధార ప్రాజెక్టుకు శంకుస్థాపన**



రాజమండ్రి: మహనీయులకు, గొప్ప నాయకులకు కులాలను అంటగడితే మనం ఎప్పటికీ భారతీయులుగా ఎదగలేమని, కేవలం కులాల సమూహంగానే మిగిలిపోతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు రూ.3,050 కోట్ల వ్యయంతో చేపడుతున్న ‘అమరజీవి జలధార’ ప్రాజెక్టు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. అంబేద్కర్, గాంధీ, పొట్టి శ్రీరాములు వంటి వారు అందరి కోసం ఆలోచించిన గొప్పవారని, వారిని కులాలకు అతీతంగా చూడాలని సూచించారు. గతంలో తాను పొట్టి శ్రీరాములు జయంతి నాడు నివాళులు అర్పించేందుకు వెళ్తే, ఆయన విగ్రహం ఒక ఆర్యవైశ్య సత్రం వద్ద ఉందని చెప్పారని, ఆ రోజు తాను ఎంతో ఆవేదనకు గురయ్యానని గుర్తుచేసుకున్నారు. తెలుగు ప్రజలందరి కోసం ప్రాణత్యాగం చేసిన వ్యక్తిని ఒక కులానికి, నెల్లూరు జిల్లాకు పరిమితం చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 5 జిల్లాల్లో ‘అమరజీవి జలధార’ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం రూ.7,910 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు ‘అమరజీవి’ అని పేరు పెట్టడానికి బలమైన కారణం ఉందని వివరించారు. తెలుగువారంతా ఏకం కావాలని ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసిన బూర్గుల రామకృష్ణారావు, తెలుగువారి ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు తనకు ఎంతో ఇష్టమైన నాయకులని, వారి త్యాగాలను స్మరించుకుంటూనే ఈ పథకానికి ఆ పేరు పెట్టినట్లు స్పష్టం చేశారు.

# జగన్ అక్రమాస్తుల కేసు మరింత జాప్యం




నాంపల్లి/హైదరాబాద్, డిసెంబర్ 20 (ఈవార్తలు): వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న నాంపల్లి సీబీఐ కోర్టు న్యాయమూర్తి బదిలీ కావడంతో, దశాబ్దాలుగా సాగుతున్న విచారణ మరింత ఆలస్యం కానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాంపల్లి సీబీఐ కోర్టు న్యాయమూర్తిగా ఉన్న రఘురాం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త న్యాయమూర్తిగా పట్టాభిరామారావును నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుత న్యాయమూర్తి ఈ నెల 22వ తేదీ తర్వాత రిలీవ్ కానుండగా, 29వ తేదీలోపు కొత్త న్యాయమూర్తి బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో కొత్తగా బాధ్యతలు చేపట్టే న్యాయమూర్తి కేసును మళ్లీ మొదటి నుంచి అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఇది విచారణ ప్రక్రియపై ప్రభావం చూపిస్తుందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. గతంలో కూడా పలుమార్లు న్యాయమూర్తులు మారడం వల్ల జగన్ అక్రమాస్తుల కేసు విచారణ ముందుకు సాగడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఈ కేసులో దాఖలైన డిశ్చార్జ్ పిటిషన్ల విచారణే ఇంకా పూర్తికాలేదు. ప్రధాన కేసు ట్రయల్ దశకు వెళ్లకుండా ఈ పిటిషన్లు అడ్డంకిగా ఉన్నాయని, వ్యూహాత్మకంగానే కేసులో జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కేసును వేగంగా విచారించి తీర్పు వెల్లడించాలని గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఆచరణలో అవి అమలు కావడం లేదు. తాజా పరిణామంతో విచారణ ఎప్పుడు పూర్తవుతుందనే అంశంపై మళ్లీ అనిశ్చితి నెలకొంది. కొత్తగా బాధ్యతలు చేపట్టబోయే న్యాయమూర్తి అయినా విచారణను వేగవంతం చేస్తారా? లేదా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడి హత్య

## హిందూ యువకుడు దీపూ చంద్రదాస్ హత్య.. స్పందించిన యూనస్ ప్రభుత్వం.. ఏడుగురి అరెస్టు

ఢాకా: బంగ్లాదేశ్‌లో 27 ఏళ్ల హిందూ యువకుడు దీపూ చంద్రదాస్ హత్య కేసులో పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. ఆందోళనకారులు దీపూను తీవ్రంగా కొట్టి చంపిన నేపథ్యంలో ఈ ఘటనపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో తాత్కాలిక యూనస్ ప్రభుత్వం స్పందించింది. ఈ హత్య కేసులో ఇప్పటి వరకు ఏడుగురిని అరెస్టు చేసినట్లు వెల్లడించింది. తమ ప్రభుత్వ హయాంలో మూకదాడులకు చోటు లేదని బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు పేర్కొన్నారు. దీపూను హత్య చేసిన నిందితులకు కఠిన శిక్ష విధిస్తామని హామీ ఇచ్చారు. దేశంలో జరుగుతున్న అల్లర్లపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ దర్యాప్తు చేస్తోందని అన్నారు. ప్రజలంతా సంయమనం పాటించి, మూక దాడులకు, హింసకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. దీపూ హంతకులను బంగ్లాదేశ్ రాపిడ్ యాక్షన్ బెటాలియన్ అరెస్టు చేసింది. అరెస్టైన వారిలో లిమోన్ సర్కార్, తారెక్ హుస్సేన్, మానిక్ మియా, ఇర్షాద్ అలీ, నిజుముద్దీన్, అలోమ్‌గిర్ హుస్సేన్, మీర్జా హుస్సేన్ అకోన్ ఉన్నారు. ఈ దుర్ఘటన మైమెన్‌సింగ్ జిల్లాలోని వాలుకా ప్రాంతంలో చోటుచేసుకుంది. ఇక్కడే దీపూ చంద్ర దాస్ హత్యకు గురయ్యాడు.

**బంగ్లాదేశ్‌లో జిహాదీల పండుగ: తస్లీమా నస్రీన్**

బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందువులపై జరుగుతున్న దాడులు అమానుషమని, అక్కడ ప్రస్తుతం 'జిహాదీల పండుగ' నడుస్తోందని బంగ్లా బహిష్కృత రచయిత్రి తస్లీమా నస్రీన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చిట్టగాంగ్‌లో దీపు దాస్ అనే హిందూ యువకుడిని అల్లరి మూకలు కొట్టి చంపిన (లించింగ్) ఉదంతంపై ఆమె సోషల్ మీడియా వేదికగా నిప్పులు చెరిగారు. దైవ దూషణకు పాల్పడ్డాడనే ఆరోపణలతో దీపు దాస్ పై మూకదాడి జరిగింది. తీవ్ర గాయాలతో దాస్ మరణించగా.. ఆయన మృతదేహాన్ని నడి రోడ్డుపై తగులబెట్టారు. ఈ దారుణానికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అంతర్జాతీయంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఈ అమానవీయ ఘటనపై బంగ్లాదేశ్ బహిష్కృత రచయిత్రి తస్లీమా నస్రీన్ స్పందిస్తూ.. "బంగ్లాదేశ్ ఇప్పుడు ఇస్లామిక్ ఉగ్రవాదుల అడ్డాగా మారింది. హిందువులను చంపడం అక్కడ ఒక పండుగలా జరుపుకుంటున్నారు" అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం, మానవ హక్కులు అనే పదాలకు బంగ్లాదేశ్ లో విలువే లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మైనారిటీలకు రక్షణ కల్పించడంలో ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె ఆరోపించారు. వాస్తవానికి దీపు దాస్ ఎలాంటి దైవ దూషణకు పాల్పడలేదని, సహోద్యోగి చేసిన కుట్రకు దీపు దాస్ ప్రాణాలు కోల్పోయాడని చెప్పారు. దీపు దాస్ తో పనిచేసే ఓ ముస్లిం వ్యక్తి అతనిపై కక్షతో కుట్ర చేసి.. జనం మధ్యలో ఉన్న సమయంలో దీపు దాస్ దైవ దూషణకు పాల్పడ్డాడని గట్టిగా అరిచాడన్నారు. దీంతో చుట్టూ ఉన్న జనం దీపు దాస్ పై దాడి చేశారని, ఇంతలో పోలీసులు అక్కడికి వచ్చి దీపు దాస్ ను అరెస్ట్ చేశారన్నారు. పోలీస్ స్టేషన్ లో దీపు దాస్ తనపై సహోద్యోగి చేసిన కుట్రను వెల్లడించినా వారు పట్టించుకోలేదన్నారు. దీపు దాస్ ను తిరిగి జనంలోకి పోలీసులే వదిలిపెట్టారా? లేక ఆ గుంపే దీపూని బయటకు లాక్కుని వెళ్లారా? అని తస్లీమా ప్రశ్నించారు. ఏమైనా, దీపూని కొట్టి, చంపేసి, దహనం చేసి జిహాదీ పండుగ చేసుకున్నారని ఆమె ఆరోపించారు. కాగా, బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ సంస్థపై ఆంక్షలు విధించడం, హిందూ మత పెద్దలను అరెస్టు చేయడం వంటి పరిణామాల మధ్య ఈ హత్య జరగడం మరింత ఉద్రిక్తతలకు దారితీసింది. మైనారిటీల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సంఘాలు ఐక్యరాజ్యసమితికి మరియు అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేస్తున్నాయి.



## ఇమ్రాన్, ఆయన భార్యకు 17 ఏళ్ల జైలుశిక్ష

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. తోషఖానా-2 అవినీతి కేసులో ఇమ్రాన్ ఖాన్‌తో పాటు ఆయన భార్య బుష్రా బీబీకి ప్రత్యేక కోర్టు 17 ఏళ్ల చొప్పున జైలుశిక్ష విధించింది. ప్రస్తుతం ఇమ్రాన్ ఖాన్ ఉన్న రావల్పిండిలోని అడియాలా జైలులోనే విచారణ జరిపిన న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది. 2021 మే నెలలో సౌదీ అరేబియా పర్యటన సందర్భంగా సౌదీ యువరాజు ఇమ్రాన్ దంపతులకు ఖరీదైన 'బల్గరి' నగల సెట్‌ను బహుమతిగా ఇచ్చారు. ప్రభుత్వ ఖజానాకు (తోషఖానా) చేరిన ఈ బహుమతిని, నిబంధనలకు విరుద్ధంగా చాలా తక్కువ ధరకు కొనుగోలు చేశారనేది వీరిపై ఉన్న ప్రధాన ఆరోపణ. ఈ కేసును విచారించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి షారుఖ్ అర్జుమండ్ ఈ తీర్పును ప్రకటించారు. నమ్మకద్రోహానికి పాల్పడినందుకు పాకిస్థాన్ పీనల్ కోడ్ సెక్షన్ 409 కింద పదేళ్లు, అవినీతి నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల కింద ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. దీంతో పాటు ఇద్దరికీ చెరో రూ. 16.4 మిలియన్ల జరిమానా కూడా విధించారు. ఈ తీర్పును హైకోర్టులో సవాలు చేస్తామని ఇమ్రాన్, బుష్రా తరఫు న్యాయవాదులు తెలిపారు. కాగా, ఈ కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, తనను రాజకీయాల నుంచి దూరం చేయడానికి కుట్ర చేస్తున్నారని ఇమ్రాన్ ఖాన్ గతంలో ఆరోపించారు. ఇప్పటికే ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి జైలులో ఉన్నారు. యూరో 190 మిలియన్ల అవినీతి కేసులో ఆయన 14 ఏళ్ల జైలుశిక్ష అనుభవిస్తున్నారు. మరోవైపు, జైలులో ఇమ్రాన్ ఖాన్‌పై పాక్ ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించడం లేదని అంతర్జాతీయంగా విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈ తాజా తీర్పు వెలువడటం గమనార్హం.

# టైంచూసి అధిష్ఠానం పిలుస్తుంది

**సీఎం మార్పుపై డీకే శివకుమార్**



బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవికి సంబంధించిన నాయకత్వ పోరు మరోసారి బహిర్గతమైంది. సరైన సమయంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను, తనను ఢిల్లీకి పిలుస్తామని పార్టీ అధిష్ఠానం తెలిపిందని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శనివారం వెల్లడించారు. ఈ పరిణామంతో సీఎం మార్పుపై జరుగుతున్న చర్చకు మరింత బలం చేకూరినట్లయింది. బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ, అసెంబ్లీ సమావేశాల తర్వాత అధిష్ఠానంతో సమావేశం ఉంటుందా అని అడిగిన ప్రశ్నకు శివకుమార్ స్పందించారు. "ఎప్పుడు ఢిల్లీ వెళ్లాలో మా ఇద్దరికీ హైకమాండ్ ఫోన్‌లో తెలియజేసింది. పిలుపు వచ్చినప్పుడు మేమిద్దరం కలిసి వెళతాం. ఆ విషయాన్ని మీడియాకు చెప్పకుండా దొంగచాటుగా వెళ్లాల్సిన అవసరం లేదు" అని ఆయన అన్నారు. అయితే, మంగళవారం తాను అధికారిక పనుల మీద ఢిల్లీ వెళుతున్నానని శివకుమార్ తెలిపారు. నదుల అనుసంధానంపై కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటానని చెప్పారు. ఈ సందర్భంగా మహదాయి, కృష్ణా జలాలు, మేకెదాటు, అప్పర్ భద్ర ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళతానని, అవసరమైతే ప్రధానిని కూడా కలుస్తానని వివరించారు. ఐదేళ్ల పాటు తానే సీఎంగా కొనసాగుతానని, అధికార పంపకాల ఒప్పందం ఏదీ లేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో డీకే శివకుమార్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే, "ముఖ్యమంత్రి, నేను, హైకమాండ్ ఒక ఒప్పందానికి కట్టుబడి ఉన్నాం" అని శివకుమార్ స్పష్టం చేశారు. దీంతో కర్ణాటక సీఎం కుర్చీ వివాదం ఇప్పుడు అధిష్ఠానం చేతుల్లోకి వెళ్లినట్లయింది.

# మోదీ బయోపిక్ షూటింగ్ ప్రారంభం

**'మా వందే' పేరుతో ప్రధాని మోదీ బయోపిక్**




న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీవితం ఆధారంగా మరో బయోపిక్ తెరకెక్కుతోంది. 'మా వందే' అనే టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రం శనివారం పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ ఈ సినిమాలో ప్రధాని మోదీ పాత్రను పోషిస్తున్నారు. చిత్రీకరణ ప్రారంభమైన విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ముహూర్తానికి సంబంధించిన వీడియోను నటుడు ఉన్ని ముకుందన్ పంచుకుంటూ, "ఒక దేశ భవిష్యత్తును తీర్చిదిద్దిన వ్యక్తి కథను చెప్పేందుకు కొత్త అధ్యాయం మొదలైంది" అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్‌లో ఈ సినిమాను ప్రకటించగా, మూడు నెలల తర్వాత చిత్రీకరణ మొదలుపెట్టారు. ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తుండటం విశేషం. 'బాహుబలి' సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్ కుమార్, 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల సంగీత దర్శకుడు రవి బస్రూర్, జాతీయ అవార్డు గ్రహీత, ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్ సాబు సిరిల్, స్టంట్ డైరెక్టర్ కింగ్ సోలమన్ వంటి దిగ్గజాలు ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ పతాకంపై వీర్ రెడ్డి ఎం. ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, క్రాంతి కుమార్ సి.హెచ్. రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ప్రధాని మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఒక నాయకుడు తయారవడం వెనకున్న మానవ ప్రస్థానాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించనున్నట్లు స్పష్టం చేశారు.

# నరేగాపై కేంద్రం బుల్డోజర్

**సోనియా గాంధీ తీవ్ర విమర్శలు**



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంపై కేంద్ర ప్రభుత్వం పద్ధతి ప్రకారం బుల్డోజర్ నడుపుతోందని ఆమె శనివారం ఆరోపించారు. ఇది గ్రామీణ పేదలు, రైతులు, వ్యవసాయ కూలీల హక్కులను కాలరాయడమేనని, వారి జీవనోపాధిపై జరుగుతున్న దాడి అని అభివర్ణించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్' ఖాతాలో ఒక వీడియో సందేశాన్ని పంచుకున్నారు. రెండు రోజుల క్రితం పార్లమెంటులో వీబీ-జీ రామ్ జీ బిల్లు 2025ను ఆమోదించిన నేపథ్యంలో సోనియా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. దాదాపు రెండు దశాబ్దాల క్రితం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాంలో ఈ చట్టాన్ని తీసుకొచ్చిన విషయాన్ని సోనియా గుర్తుచేశారు. ఇది కోట్లాది గ్రామీణ కుటుంబాలకు, ముఖ్యంగా అణగారిన వర్గాలకు జీవనోపాధి భద్రత కల్పించిన ఒక విప్లవాత్మక అడుగు అని ఆమె పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఈ పథకం పేదలకు జీవనాధారంగా నిలిచిందని తెలిపారు. అయితే, గత 11 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుగార్చేందుకు అనేక ప్రయత్నాలు చేసిందని సోనియా ఆరోపించారు. ప్రతిపక్షాలతో సంప్రదింపులు జరపకుండా, ఏకపక్షంగా ఉపాధి హామీ పథకం స్వరూపాన్నే మార్చేశారని, చివరకు మహాత్మా గాంధీ పేరును కూడా తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికి, ఎక్కడ, ఎంత పని ఇవ్వాలనే నిర్ణయాలను క్షేత్రస్థాయి వాస్తవాలకు దూరంగా ఢిల్లీ నుంచి తీసుకుంటున్నారని విమర్శించారు. "20 ఏళ్ల క్రితం ఈ చట్టం కోసం నేను పోరాడాను. ఇప్పుడు ఈ నల్ల చట్టానికి వ్యతిరేకంగా పోరాడేందుకు కూడా నేను కట్టుబడి ఉన్నాను" అని సోనియా ఉద్ఘాటించారు. ఈ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

# విదేశాలకు రాహుల్

**దేశ వ్యతిరేకులతో భేటీ అయ్యారని బీజేపీ ఆగ్రహం**



న్యూఢిల్లీ: జర్మనీ పర్యటనలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత వ్యతిరేకులతో సమావేశమయ్యారని బీజేపీ ఆరోపించింది. దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపి ఆయన దేశానికి వ్యతిరేకంగా ఎలాంటి కుట్రలు పన్నుతున్నారో చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మాట్లాడుతూ, అమెరికాకు చెందిన బిలియనీర్ జార్జ్ సోరోస్‌తో రాహుల్ గాంధీకి సంబంధాలున్నాయని మరోసారి ఆరోపించారు. విదేశీ గడ్డపై దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ గాంధీ చేతులు కలుపుతున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ, జార్జ్ సోరోస్ ఇద్దరు వేర్వేరు వ్యక్తులైనప్పటికీ వారి ఆత్మ ఒక్కటేనని విమర్శించారు. జార్జ్ సోరోస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సెంట్రల్ యూనివర్సిటీ ట్రస్టీతో రాహుల్ గాంధీ భేటీ అయ్యారని ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల జరుగుతున్న సమయంలో రాహుల్ గాంధీ తరచూ విదేశీ పర్యటనలు చేయడం కొత్తేమీ కాదని అన్నారు. భారత్ పట్ల ద్వేషం వెళ్లగక్కుతూ, దేశ సమగ్రతను దెబ్బతీసేందుకు కుట్ర పన్నే వ్యక్తులతో ఆయన సమావేశమవుతున్నారని విమర్శించారు.

# మెస్సీ భారత పర్యటన ఖర్చు 100 కోట్లు

**విచారణలో కీలక విషయాలు వెల్లడి**

న్యూఢిల్లీ: భారత పర్యటన కోసం సాకర్ స్టార్ లియోనెల్ మెస్సీకి రూ.89 కోట్లు చెల్లించినట్లు ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు దత్తా వెల్లడించారు. లియోనల్ మెస్సీ భారత పర్యటన సందర్భంగా కోల్‌కతా స్టేడియంలో చోటుచేసుకున్న ఘటనలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో శతాద్రు దత్తా అరెస్టై ప్రస్తుతం కస్టడీలో ఉన్నాడు. అతనిని ప్రత్యేక దర్యాప్తు బృందం ఆయనను విచారిస్తోంది. విచారణలో ఆయన కీలక విషయాలను వెల్లడించాడని తెలుస్తోంది. సమాచారం ప్రకారం, స్టేడియంలోకి రాగానే అనేకమంది తాకడం, కౌగిలించుకోవడం వంటి చర్యలతో మెస్సీ అసౌకర్యానికి గురయ్యాడని, దీంతో అతడు షెడ్యూల్ కంటే ముందుగానే అక్కడి నుంచి వెళ్లిపోయాడని దత్తా చెప్పారు. జనసమూహాన్ని అదుపు చేయాలని పదేపదే ప్రకటించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని విచారణలో వెల్లడించారు. మైదానంలోకి రావడానికి 150 మందికి మాత్రమే పాసులు ఉన్నాయని, కానీ అంతకు మూడు రెట్లు ఎక్కువ మంది వచ్చారని తెలిపారు. మెస్సీ పర్యటనకు మొత్తం రూ.100 కోట్లు ఖర్చయిందని శతద్రు వెల్లడించారు. మెస్సీకి రూ.89 కోట్లు చెల్లించామని, భారత ప్రభుత్వానికి రూ.11 కోట్లు పన్నుగా చెల్లించామని తెలిపాడు. ఈ నిధుల్లో 30 శాతం స్పాన్సర్ల ద్వారా, మరో 30 శాతం టిక్కెట్లు విక్రయం ద్వారా సేకరించినట్లు ఆయన చెప్పాడని సమాచారం.

# యువతిపై ఆర్మీ జవాన్ రేప్

రాంచీ: జార[illegible]ండ్ రాజధాని రాంచీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. దేశ రక్షణ విధుల్లో ఉండాల్సిన ఓ ఆర్మీ జవానే ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అమానుష ఘటన టాటీసిల్వాయి రైల్వే స్టేషన్‌లో జరిగింది. ఈ ఆరోపణలపై పోలీసులు నిందితుడైన సైనికుడిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, 22 ఏళ్ల యువతి రాంచీ వెళ్లేందుకు రైలు కోసం స్టేషన్‌లో ఎదురుచూస్తోంది. అదే సమయంలో డిఫెన్స్ లాజిస్టిక్స్ రైలుకు భద్రతా విధుల్లో ఉన్న సైనికుడు, ఆమెను ఓ ఖాళీ బోగీలోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఘటన సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బాధితురాలు కేకలు వేయడంతో సమీపంలోని ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. వారు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఇంతలో అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడిని తోటి ప్రయాణికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. నిందితుడు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందినవాడని, పంజాబ్‌లోని పాటియాలాలో విధులు నిర్వర్తిస్తున్నాడని పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, అతడిని అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతడికి రిమాండ్ విధించింది.

# అధికారం ఏ ఒక్కరికీ పరిమితం కాదు

**కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్**



పుణె: అధికారం ఏ ఒక్క దేశానికీ పరిమితం కాదని, ఈ విషయాన్ని శక్తిమంతమైన దేశాలు గుర్తించాలని విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. శక్తిమంతమైన దేశమైనా సరే తన ఇష్టాలను ఇతరులపై రుద్దడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలోని పుణేలో సింబయోసిస్ ఇంటర్నేషనల్‌లో జరిగిన స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. ప్రపంచీకరణ మన ఆలోచన విధానంలో, పని విధానంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, అనేక అధికార కేంద్రాలు ఉద్భవించాయని మంత్రి పేర్కొన్నారు. అధికారం అనే పదానికి ఎన్నో అర్థాలు ఉంటాయని వ్యాఖ్యానించారు. వాణిజ్యం, మిలిటరీ, ఇంధనం, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా ఇవి మారుతుంటాయని అన్నారు. ఈ విధమైన అధికారం ఏ ఒక్క దేశానికీ పరిమితం కాదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రపంచాధిపత్యం కలిగిన దేశాలు గుర్తించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ప్రపంచ దేశాల మధ్య సహజమైన పోటీ ఉంటుందని వ్యాఖ్యానించారు. భారత్ వంటి పెద్ద ఆర్థిక వ్యవస్థలు తయారీ రంగంలో దూసుకెళ్లాల్సిన అవశ్యకతను ఆయన గుర్తు చేశారు.

# చొరబాటుదారులకు మమత రక్షణ

**బెంగాల్ సర్కారుపై ప్రధాని మోదీ విమర్శలు**



న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని నాడియాలో జరిగిన ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పొగమంచు కారణంగా ర్యాలీ ప్రాంతానికి చేరుకోలేకపోయిన ఆయన, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అధికార టీఎంసీ ప్రభుత్వం బెంగాల్‌లో చొరబాటుదారులను ప్రోత్సహిస్తోందని ఆయన ఆరోపించారు. అందుకే రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని అన్నారు. మమతా బెనర్జీ పాలనలో బెంగాల్లో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయని మోదీ దుయ్యబట్టారు. ఇటువంటి మహా జంగిల్ రాజ్‌కు తగిన బుద్ధి చెప్పాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తృణమూల్ నేతలు, ఆ పార్టీ బీజేపీని ఎంత వ్యతిరేకించినప్పటికీ బెంగాల్ అభివృద్ధిని మాత్రం తాము ఎప్పుడూ ఆపబోమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులను మమత ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. మమతా బెనర్జీ పాలనలో ఉద్రిక్తతలు, అల్లర్లు, బెదిరింపులతో విసిగిపోయిన ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. బీహార్ ఎన్నికల ఫలితం బెంగాల్ ఎన్నికల్లో తమ విజయానికి మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఒయ్యారి చిత్రం




# సంక్రాంతి 2026 వార్

ప్రతి సంక్రాంతికి టాలీవుడ్‌లో క్రేజీ సినిమాలు పోటీపడటం సర్వసాధారణం. అయితే ఒక్కేసారి ఈ ఫెస్టివల్‌కు రెండు నుంచి మూడు సినిమాలు మాత్రమే బరిలో నిలిచేవి. కానీ ఈ ఏడాది మాత్రం ఏకంగా ఐదు క్రేజీ సినిమాలు పోటీపడుతున్నాయి. అందులో మెగాస్టార్ చిరంజీవి మన శంకర వరప్రసాద్ గారుతో పాటు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ది రాజాసాబ్ కూడా ఉంది. మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడితో కలిసి తన మార్కు ఫ్యామిలీ అంశాలతో ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానంగా చేసిన మూవీ మన శంకరవరప్రసాద్ గారు. 2025 సంక్రాంతికి సంక్రాంతికి వస్తున్నాం మూవీతో సందడి చేసి బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకున్న అనిల్ రావిపూడి మరోసారి సంక్రాంతి బరిలోకి చిరుతో దిగుతున్నాడు. దీంతో ఈ సినిమాపై ఫ్యామిలీ ఆడియన్స్‌లో అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. జనవరి 12న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇక దీనికి రెండు రోజుల ముందు సంక్రాంతి సందడిని మొదలు పెడుతూ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మూవీ ది రాజా సాడ్ రాబోతోంది. ప్రభాస్ కెరీర్‌లో ఫస్ట్ టైమ్ చేస్తున్న కామెడీ హారర్ మూవీ ఇది. పీపుల్ మీడియా బ్యానర్‌పై టి.జి. విశ్వప్రసాద్ అ్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. మారుతికిది తొలి పాన్ ఇండియా స్టార్ మూవీ కావడంతో ఈందరి దృష్టి ఈ ప్రాజెక్ట్‌పై పడింది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, టీజర్, ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచేస్తున్నాయి. ఇక వీటితో పాటు మాస్ మహారాజా తొలి సారి తన పంథాకు పూర్తి భిన్నంగా చేస్తున్న ఫ్యామిలీ డ్రామా మూవీ భర్త మహాశయులకు విజ్ఞప్తి జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రాడబోతోంది. కిషోర్ తిరుమల కొంత విరామం తరువాత చేస్తున్న సినిమా ఇది. అషికా రంగనాథ్, డిపుల్ హయాతీ హీరోయిన్‌లు నటించిన ఈ మూవీపై కూడా మంచి ఎక్స్ పెక్టేషన్సే ఉన్నాయి. వీరితో సంక్రాంతి బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు యంగ్ హీరోలు నవీన్ పొలిశెట్టి, శర్వానంద్ కూడా దిగుతున్నారు. నవీన్ పొలిశెట్టి దాదాపు రెండేళ్ల విరామం తరువాత చేసిన మూవీ అనగనగా ఒక రాజు మీనాక్షీ చౌదరి హీరోయిన్. కామెడీ ప్రధానంగా సాగే ఈ సినిమా జనవరి 14న రిలీజ్ కానుండగా, శర్వానంద్ నటిస్తున్న ఫ్యామిలీ డ్రామా నారీ నారీ నడుమ మురారీ కూడా ఇదే రోజున ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ తెలుగు సినిమాలతో పాటు దళపతి విజయ్ తమిళ డబ్బింగ్ మూవీ జననాయకుడు జనవరి 9నే బరిలోకి దిగుతోంది. సంక్రాంతి బరిలో ఎన్ని సినిమాలు దిగుతున్నా ఈ రేసులో పైచేయి సాధించేది ఎవరనే చర్చ టాలీవుడ్‌లో మొదలైంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కామెడీ హారర్ థ్రిల్లర్ ది రాజా సాబ్‌తో బరిలోకి దిగుతున్నా తన క్రేజ్‌కు తగ్గ స్థాయిలో మాత్రం సందడి చేయలేకపోతోంది. కానీ మెగాస్టార్ మన శంకర వరప్రసాద్ గారు మాత్రం ఇప్పటికే ప్రేక్షకుల నుంచి అటెన్షన్‌ని గ్రాబ్ చేసి సంక్రాంతి సినిమాల రేస్‌లో ముందంజలో నిలచింది. మొదటి నుంచి ఓ కాన్సెప్ట్ ప్రకారం సినిమాని ప్రమోట్ చేస్తూ వస్తున్న అనిల్ రావిపూడి ఈ మూవీని తనదైన మార్కు పబ్లిసిటీలో సంక్రాంతి రేసులో ముందంజలో ఉండేలా చేయడం గమనార్హం. ఈ లెక్కన చూస్తే స్పీడు తగ్గిన ది రాజా సాబ్‌ని వెనక్కి నెట్టి సంక్రాంతి బరిలో బాక్సాఫీస్ వద్ద సిక్స్ కొట్టేది చిరంజీవే అని స్పష్టమవుతోంది.













## డబ్బు కోసం తప్పలేదు

బోల్డ్ బ్యూటీ రాధిక ఆప్టే క్యాస్టింగ్ కౌచ్‌పై సంచలన కామెంట్లు చేసింది. ముఖ్యంగా ఆ సమయం వస్తే ఎంతటి ధైర్యవంతులైనా సరే ఆ భయాన్ని అనుభవించాల్సిందే అంటూ చెప్పుకొచ్చింది. ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. తన కెరియర్ గురించి.. ఇండస్ట్రీలో తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి చెప్పుకొచ్చింది. రాధిక ఆప్టే మాట్లాడుతూ.. 'ఒకప్పుడు ఆర్థిక సమస్యల కారణంగానే నేను సౌత్ లో సినిమాలు చేయాల్సి వచ్చింది. ఆ సమయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. ఇక తప్పని పరిస్థితిలో డబ్బు అవసరం కాబట్టే దక్షిణాది సినిమాలలో నటించాను. నిజానికి కొన్నిసార్లు సెట్స్‌లో భయంకరమైన అనుభవాలు కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది . మారుమూల పట్టణాల్లో షూటింగ్‌కి వెళ్తే.. సొంత సిబ్బందిని కూడా సెట్‌లోకి రానిచ్చేవారు కాదు. ఆ సమయంలో మహిళల గురించి అసభ్యకరమైన జోకులు వేసేవారు.





## ప్రేక్షకులదే తప్పు

అనుపమా పరమేశ్వరన్ నటించిన లేడీ ఓరియేంటెడ్ చిత్రం.. పరదా. ఈ బ్యూటీ నటించిన తొలి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ ఇది. కానీ సినిమా అంచనాలు అందుకోలేకపోయింది. ఈ ఫ్లాప్ విషయంలో అనుపమ వాదన ఎంతో భిన్నంగా ఉంది. కమర్షియల్ సినిమాలకు ఉన్న ప్రాధాన్యత కాన్సెప్ట్ సినిమాలకు ప్రేక్షకులు ఇవ్వడం లేదని వ్యాఖ్యా నించింది. ఇమేజ్ ఆధారంగా తెలుగులో సినిమాలు ఆడుతున్నాయని అభిప్రాయపడింది. కానీ అవన్నీ పదేళ్ల క్రితం నాటి వ్యాఖ్యలు అన్నది గమనించలేకపోయింది.

## ఆ ఫీలింగ్ గొప్పది

పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో రాశీఖన్నా తొలిసారి సిల్వర్ స్క్రీన్‌పై పవన్ కల్యాణ్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతుంది. ఇటీవలే పవన్ కల్యాణ్‌కు రాశీఖన్నా బర్త్ డే విషెస్ చెబుతూ ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ సందర్భంగా లొకేషన్‌లో డైరెక్టర్ హరీష్ శంకర్, పవన్ కల్యాణ్‌తో సీన్ గురించి డిస్కషన్ చేస్తున్న స్టిల్‌ను షేర్ చేస్తూ.. పవన్ కల్యాణ్ సార్ మీ బలం, క్రమశిక్షణ, చిత్తశుద్ధితో మీ ప్రయాణం మిలియన్ల మందికి స్ఫూర్తిని అందిస్తూనే ఉందంటూ క్యాప్షన్ కూడా పోస్ట్ చేసి నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. ఓ చిట్‌చాట్ సెషన్‌లో తాను ఎంతో అభిమానించే పవన్ కల్యాణ్‌తో సెల్ఫీ విషయమై ఆసక్తికర కామెంట్స్ చేసింది రాశీఖన్నా. పవన్ కల్యాణ్ సార్‌ను ఒక ఫొటో కోసం అసౌకర్యంగా ఫీలయ్యేలా చేయొద్దనిపించింది. కానీ ఒక రోజు పవన్ కల్యాణ్ తనకు తానే వచ్చి ఆయనతో ఓ ఫొటో దిగాలని అడిగారు. ఇది చాలా గొప్ప విషయం. అప్పుడు కలిగిన ఫీలింగ్ నా మాటల్లో చెప్పలేనంది రాశీఖన్నా. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతోంది.



## 27న నెట్‌ఫ్లిక్స్‌లోకి ఆంధ్ర కింగ్ తాలూకా

రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. తెలుగు సినీ అభిమాని కథగా నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమా విడుదలై నెల కూడా తిరక్కుండానే ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో డిసెంబర్ 25 నుంచి తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. విషయాన్ని తెలుపుతూ నెట్‌ఫ్లిక్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది.



## బీజేపీలోకి సీనియర్ నటి ఆమని

టాలీవుడ్ సీనియర్ నటి ఆమని రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించింది. శనివారం ఆమె అధికారికంగా భారతీయ జనతా పార్టీలో చేరింది. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సమక్షంలో ఆమని బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాంచందర్ రావు ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆమనీతో పాటు ప్రముఖ సినీ మేకప్ ఆర్టిస్ట్ శోభలత కూడా ఇదే వేదికపై కాషాయ గూటికి చేరారు. పార్టీలో చేరిన తర్వాత ఆమని మీడియాతో మాట్లాడుతూ.. తన మనసులోని మాటను పంచుకున్నారు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా గర్వించదగ్గ స్థాయికి చేరుకుంది. భారతీయురాలిగా గర్వపడేలా చేసిన ఆయన అడుగుజాడల్లో నడవాలని నిర్ణయించుకున్నాను అని ఆమని తెలిపారు. మోదీ ప్రభుత్వం సనాతన ధర్మ పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని ఆమె పేర్కొన్నారు. పదవుల కోసం కాకుండా, కేవలం సామాన్య ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు స్పష్టం చేశారు.






అండర్-19 వరల్డ్ కప్‌లో వరుస విజయాలతో జోరుమీద ఉన్న యువ భారత్ కీలక పోరుకు సిద్ధమైంది. ఆదివారం ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాక్‌తో టీమ్ఇండియా తలపడనుంది.

రెండు జట్లు బలబలాలను చూస్తే.. ఆయుష్ మాత్రే నాయకత్వంలోని టీమ్ఇండియా జట్టు మ్యాచ్‌లో ఫేవరెట్. లీగ్ దశలో పాకిస్థాన్‌ను భారత కుర్రాళ్లు 90 రన్స్ తేడాతో మట్టికరిపించారు. మరోసారి పాక్‌కు షాక్ ఇచ్చి, రికార్డు స్థాయిలో ఎనిమిదో టైటిల్‌ను పట్టేయాలని భారత జట్టు తహతహలాడుతోంది.

# కుర్రాళ్ల కుస్తీ!

## నేడే భారత్-పాక్ అండర్ 19 ఫైనల్




టోర్నీలో ఇప్పటివరకు 4 మ్యాచ్‌లు ఆడిన భారత్.. రెండు మ్యాచ్‌ల్లో 400కుపైగా స్కోర్లు చేసింది. దీనిని బట్టి భారత బ్యాటర్ల జోరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైభవ్ సూర్యవంశీ, అభిజ్ఞాన్ కుందు ఇద్దరూ సూపర్‌ఫామ్‌లో ఉన్నారు. యూఏఈపై వైభవ్ 95 బంతుల్లో 171 రన్స్ చేయగా, మలేసియాపై అభిజ్ఞాన్ డబుల్ సెంచరీ (209) కొట్టాడు. మిడిల్ ఆర్డర్‌లో ఆరోన్ జార్జి నిలకడగా రాణిస్తున్నాడు. కాన్షిక్ చౌహాన్ ఫినిషింగ్ టచ్ ఇస్తున్నాడు. లీగ్ స్టేజ్‌లో పాకిస్థాన్‌పై 25 బంతుల్లో 38 రన్స్ చేసిన కెప్టెన్ ఆయుష్ మాత్రే నుంచి భారత్ భారీ ఇన్నింగ్స్ ఆశిస్తోంది. బౌలింగ్ విషయానికొస్తే..పేసర్ దేపేశ్ దేవేంద్రన్ టీమ్ఇండియాకు కీలకం కానున్నాడు. దేవేంద్రన్ మంచి వేగం.. కచ్చితత్వంతో బంతులు విసురుతూ ఆదిలోనే వికెట్లు తీస్తున్నాడు. ఇతడు మలేసియాతో మ్యాచ్‌లో 22 రన్స్‌కే ఐదు వికెట్లు పడగొట్టాడు. మొత్తం మీద 4 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీశాడు. దీపేశ్ మరోసారి విజృంభిస్తే టీమ్ఇండియాకు తిరుగుండదు. అయితే, పాకిస్థాన్‌ను తక్కువ అంచనా వేయలేం. లీగ్ స్టేజ్‌లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో తప్ప మిగిలి వాటిలో పాకిస్థాన్ నెగ్గింది. సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ బంగ్లాను 121 పరుగులకే ఆలౌట్ చేసి 16.3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ సమీర్ మిన్హాస్‌పై టీమ్ఇండియా బౌలర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే టోర్నీలో 299 రన్స్‌తో ఇతడు టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. పేసర్ అబ్దుల్ సుభాన్ బాల్‌తో అదరగొడుతున్నాడు. 3 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీసిన సుభాన్‌ను టీమ్ఇండియా బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటున్నారో చూడాలి. భారత్, పాకిస్థాన్ అండర్-19 ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్ దుబాయ్‌లోని ఐసీసీ అకాడమీ స్టేడియంలో జరగనుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్, సోనీలివ్ ఓటీటీ ప్లాట్‌ఫాంలో మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది.

## అందుకే గిల్‌ను పక్కనబెట్టాం: సూర్య



టీ20 వరల్డ్ కప్‌లో మిడిలార్డర్ బలాన్ని పెంచేందుకే శుభ్‌మన్ గిల్‌ను పక్కన పెట్టాల్సి వచ్చిందని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. టాపార్డర్ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌తో పాటు రింకూ సింగ్ కోసం గిల్‌ను తప్పించాల్సి వచ్చిందని వివరణ ఇచ్చాడు. శుభ్‌మన్ గిల్ పేలవ ఫామ్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోలేదని, అతని క్లాస్ బ్యాటింగ్‌పై తమకు ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో బరిలోకి దిగే భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో బోర్డ్ సెక్రటరీ దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగిన టీమ్ సెలెక్షన్ సమావేశంలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో పాటు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, సెలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం 15 మంది సభ్యులతో కూడిన భారత టీ20 ప్రపంచకప్ జట్టు వివరాలను చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు. శుభ్‌మన్ గిల్‌తో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ జితేశ్ శర్మపై వేటు పడింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో సత్తా చాటిన ఇషాన్ కిషన్‌ను బ్యాకప్ వికెట్ కీపర్‌గా సెలెక్టర్లు ఎంపిక చేశారు. రింకూ సింగ్ రీఎంట్రీ ఇవ్వగా.. అక్షర్ పటేల్‌కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు దక్కాయి.




## మళ్లీ ఫామ్‌లోకి వస్తా

ప్రపంచ కప్ ముంగిట తప్పకుండా ఫామ్ అందుకుంటానని సూర్యకుమార్ ధీమా వ్యక్తం చేశాడు. వచ్చే నెల 11 నుంచి న్యూజిలాండ్‌తో భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. ఈ విరామంలో ఫామ్ అందుకోవడంపై దృష్టిపెడతానని భారత కెప్టెన్ పేర్కొన్నాడు. 'కొంతకాలంగా ఫామ్‌లో లేను.




ప్రతి ఒక్కరూ తమ తమ కెరీర్లలో ఇలాంటి దశను ఎదుర్కొన్నారని నేను కచ్చితంగా అనుకుంటున్నా. నేను కూడా దీనిని అధిగమిస్తా. తప్పెక్కడ జరుగుతోంది, అందుకు ఏం చేయాలో నాకు తెలుసు. దానిపై పని చేయడానికి నాకు కొంత సమయం దొరికింది. మరికొన్ని రోజుల్లో న్యూజిలాండ్‌తో సిరీస్ ప్రారంభంకానుంది. తర్వాత కీలకమైన టీ20 ప్రపంచ కప్ ఉంది. సూర్య ఫామ్‌లోకి రావడాన్ని కచ్చితంగా చూస్తారు' అని సూర్యకుమార్ పేర్కొన్నాడు.

## పాండ్యా అత్యుత్తమం: సౌతాఫ్రికా హెడ్ కోచ్

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాపై సౌతాఫ్రికా హెడ్ కోచ్ షుక్రి కాన్రాడ్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఐదు టీ20ల సిరీస్‌లో ఇరు జట్ల మధ్య ఉన్న ఏకైక వ్యత్యాసం హార్దిక్ పాండ్యానేనని తెలిపాడు. జస్‌ప్రీత్ బుమ్రా కంటే హార్దిక్ పాండ్యానే ఎక్కువ ప్రభావం చూపాడని చెప్పుకొచ్చాడు. హార్దిక్ పాండ్యా వరల్డ్ బెస్ట్ ఆల్‌రౌండర్ అని కొనియాడాడు. అతనికే ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ ఇవ్వాలని కూడా అభిప్రాయపడ్డాడు. 'నిజాయితీగా చెప్పాలంటే జస్‌ప్రీత్ బుమ్రా కంటే హార్దిక్ పాండ్యానే ఈ సిరీస్‌లో ఎక్కువ ప్రభావం చూపాడు. బుమ్రా ప్రతిభను తక్కువ చేసి మాట్లాడటం నా ఉద్దేశం కాదు. కానీ ఈ సిరీస్‌లో ఇరు జట్ల మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం హార్దిక్ పాండ్యా. ఈ రాత్రి అతను ఆడిన ఇన్నింగ్సే మా విజయవకాశాలను దెబ్బతీసింది. తొలి మ్యాచ్‌లో కూడా భారత్ కష్టాల్లో ఉన్నప్పుడు అతను వచ్చి కీలకమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఫార్మాట్‌లోనే అత్యుత్తమ ఆటగాళ్లలో హార్దిక్ పాండ్యా ఒకడు అనడానికి ఈ సిరీసే నిదర్శనం. అతని ప్రదర్శన టాప్‌లో ఉంది. ఈ సిరీస్‌లో మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఎవరో నాకు ఇంకా తెలియదు కానీ, అది అతనే కాకపోతే నేను చాలా ఆశ్చర్యపోతాను. కాబట్టి, రెండు జట్ల మధ్య అతనే అతిపెద్ద తేడా'అని షుక్రి కాన్రాడ్ చెప్పుకొచ్చాడు.





# 4 వికెట్లా.. 228 పరుగులా?

## ఇంగ్లండ్ బ్యాటర్లు అద్భుతం చేస్తారా?.. కంగారులే పైచేయి సాధిస్తారా?.. తిప్పేసిన ఆసీస్ స్పిన్నర్ లియాన్

యాషెస్ సిరీస్ సమం చేయాలనుకున్న ఇంగ్లండ్ ఇక ఆశలు వదులుకోవాల్సిందే. రెండు టెస్టుల్లో ఆస్ట్రేలియాకు కనీసం పోటీ ఇవ్వలేకపోయిన ఇంగ్లిష్ టీమ్.. అడిలైడ్‌లోనూ అదే తడబాటుతో ఓటమి అంచున నిలిచింది. ట్రావిస్ హెడ్(170) భారీ శతకంతో పుంజుకున్న ఆసీస్ నాలుగో రోజు కమిన్స్(3-24), నాథన్ లియాన్(3-64)ల విజృంభణతో గెలుపు దిశగా సాగుతోంది. వీరిద్దరి ధాటికి ఇంగ్లండ్ టాపార్డర్ కుప్పకూలగా.. జేమీ స్మిత్(2 నాటౌట్), విల్ జాక్స్(11 నాటౌట్) పోరాడుతున్నారు. ఆఖరి సెషన్‌లో వీరిద్దరూ పట్టుదలగా ఆడడంతో ఆట ముగిసే సరికి 6 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా గడ్డపై యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ మరో ఓటమికి చేరువలో ఉంది. ఇప్పటికే పెర్త్, బ్రిస్బేన్‌లో కంగుతిన్న పర్యాటక జట్టు చావోరేవో పోరులోనూ ఎదురీదుతోంది. అడిలైడ్ టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో జాక్ క్రాలే(85) అర్ధ శతకంతో ఆశలు రేపినా.. కమిన్స్ (3-24), నాథన్ లియాన్(3-64) వికెట్ల వేటకు టాపార్డర్ కుప్పకూలింది. కమిన్స్ ఓవర్లో జో రూట్(39), లియన్ దెబ్బకు హ్యారీ బ్రూక్(30)లు తేలిపోయారు. స్వల్ప తేడాతో



బ్రూక్‌ను, బెన్‌స్టోక్స్(5)ను బౌల్డ్ చేసిన లియాన్ ఇంగ్లండ్‌ను విజయావకాశాల్ని దెబ్బతీశాడు. అర్ధ శతకంతో పోరాడిన క్రాలేను ఔట్ చేసి ఇంగ్లండ్‌ను ఓటమి అంచున నిలిపాడు లియాన్. ఆఖరి సెషన్‌లో జేమీ స్మిత్(2 నాటౌట్), విల్ జాక్స్(11 నాటౌట్)లు వికెట్ కాపాడుకోవడంతో ఆట ముగిసే సరికి 6 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. యాషెస్ సిరీస్ సమం చేయాలంటే ఇంగ్లండ్ విజయానికి 228 రన్స్ అవసరం. కానీ, చివరి రోజు వీరిద్దరూ సెంచరీలు సాధిస్తే తప్ప గెలుపు అసాధ్యం. ఒకవేళ తొలి సెషన్‌లోనే ఔటయ్యారంటే.. టెయిలెండర్లను కమిన్స్, లియాన్ చుట్టేయడం పక్కా. తొలి ఇన్నింగ్స్‌లో జోఫ్రా ఆర్చర్(5-53) చెలరేగగా ఆసీస్‌ను 371కే కట్టడి చేసిన ఇంగ్లండ్ బ్యాటర్ల వైఫల్యంతో మ్యాచ్‌పై పట్టు సాధించలేకపోయింది.



## భగవద్గీత చదివి ఒత్తిడిని అధిగమించా

దేశవాళీలో విధ్వంసక ఆటతో సెలెక్టర్లకు సవాల్ విసిరిన ఇషాన్ కిషన్ మళ్లీ నీలిరంగు జెర్సీ వేసుకోనున్నాడు. భగవద్గీత చదవడం ద్వారా ఒత్తిడి, కష్టాలను అధిగమించానని చెప్పాడీ హిట్టర్. న్యూజిలాండ్‌తో ఐదు టీ20 సిరీస్‌తో పాటు ప్రపంచకప్ కోసం ఎంపిక చేసిన 15మంది స్క్వాడ్‌లో ఇషాన్‌కు చోటు లభించింది. శవాళీలో మెరుపు ఇన్నింగ్స్‌లతో అవకాశం దక్కించుకున్నాడు. దాంతో.. రెండేళ్ల క్రితం చివరి టీ20 ఆడిన ఇషాన్ కిషన్‌ను మళ్లీ బ్లూ జెర్సీలో చూసే రోజులొచ్చేశాయి. టాపార్డర్‌లో రెండో వికెట్ కీపర్ ఉండాలనే ఉద్దేశంతోనే ఇషాన్‌కు చోటిచ్చామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు.




# గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజం

తెలంగాణ రాజకీయ యవనికపై మళ్ళీ గులాబీ జెండా రెపరెపలాడేందుకు సిద్ధమైంది. కొంతకాలం స్తబ్ధత తర్వాత భారత్ రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ రాజకీయ క్షేత్రంలో బిజీ కాబోతున్నారు. ఆదివారం జరిగే సమావేశంలో బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని కేటీఆర్ చెప్పారు. దీంతో గులాబీ శ్రేణులు అలర్ట్ అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి సహా ఏపీ నిర్మించ తలపెట్టిన సాగునీటి ప్రాజెక్టుల వల్ల తెలంగాణకు జరగబోయే నష్టంపై కేసీఆర్ మళ్లీ ఉద్యమబాట పట్టే అవకాశం ఉంది. కృష్ణా, గోదావరి నదీ జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తూ, రైతుల హక్కుల కోసం మరో భారీ ప్రజా ఉద్యమానికి కేసీఆర్ సిద్ధమవుతున్నారు. కేసీఆర్ మళ్ళీ తన మార్కు రాజకీయాలతో ప్రజల్లోకి వెళ్తుండటం, అటు విపక్షాలను ఎదుర్కోవడానికి మరియు ఇటు కేడర్‌ను ఏకతాటిపైకి తేవడానికి గట్టి పునాదిగా కనిపిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతను అందిపుచ్చుకోవడంలో కేసీఆర్ నాయకత్వం పార్టీకి ఒక బూస్టర్ డోస్‌లా పనిచేయనుంది.

**- ఈవార్తలు సంపాదకీయం**

మానవ జీవితం ఒక అద్భుతమైన ప్రయాణం. అయితే, ప్రస్తుత యాంత్రిక జీవనంలో మనిషి తనను తాను మర్చిపోయి బాహ్య ప్రపంచంలోని వేగంతో పోటీ పడుతున్నాడు. ఈ క్రమంలో మానసిక ప్రశాంతతను కోల్పోతున్నాడు. ప్రాచీన భారతీయ సంస్కృతి మనకు అందించిన అమూల్యమైన కానుక ధ్యానం. ధ్యానం అంటే కేవలం కళ్ళు మూసుకోవడం కాదు, అది అంతర్ముఖ ప్రయాణం. మనస్సును ఏకాగ్రతతో ఉంచి, ఆలోచనలను నియంత్రించి, ఆత్మజ్ఞానాన్ని పొందే ప్రక్రియే ధ్యానం. ధ్యానం అనేది సంస్కృత పదం 'ధ్యై' నుండి ఉద్భవించింది, దీని అర్థం 'చింతించడం' లేదా 'ఏకాగ్రత వహించడం'.




# యాంత్రిక జీవనానికి... రెమెడీ ధ్యానం

పతంజలి యోగ సూత్రాల ప్రకారం, 'తత్ర ప్రత్యయైకతానతా ధ్యానమ్' అంటే మనస్సును ఒకే విషయంపై నిరంతరంగా లగ్నం చేయడమే ధ్యానం. సాధారణంగా మన మనస్సు క్షణానికి వేల ఆలోచనలతో నిండి ఉంటుంది. ఆ ఆలోచనల ప్రవాహాన్ని క్రమబద్ధీకరించి, శూన్య స్థితికి చేరుకోవడమే ధ్యానంలోని పరమార్థం. ధ్యానం మనిషిని తన గురించి తాను తెలుసుకునేలా చేస్తుంది. మనలోని లోపాలను, బలాన్ని అర్థం చేసుకోవడానికి ఇది తోడ్పడుతుంది. విద్యార్థులకు, ఉద్యోగులకు ధ్యానం ఎంతో అవసరం. ఇది ఏకాగ్రతను పెంచి, పనిలో నైపుణ్యాన్ని మెరుగుపరుస్తుంది. కోపం, అసూయ, ద్వేషం వంటి ప్రతికూల భావాలను తగ్గించి, ప్రేమ, కరుణ, సహనం వంటి సానుకూల గుణాలను పెంచుతుంది. నేటి కాలంలో స్ట్రెస్ అనేది ఒక ప్రధాన సమస్య. ధ్యానం చేయడం వల్ల శరీరంలో కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్లు తగ్గి, ప్రశాంతత లభిస్తుంది. ధ్యానం వల్ల రక్త ప్రసరణ క్రమబద్ధీకరించబడి, రక్తపోటు అదుపులో ఉంటుంది. క్రమం తప్పకుండా ధ్యానం చేసేవారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని శాస్త్రీయంగా నిరూపితమైంది. దీర్ఘకాలిక నొప్పులతో బాధపడేవారికి ధ్యానం ఉపశమనాన్ని ఇస్తుంది. నిద్రలేమి సమస్యతో బాధపడేవారికి ఒక వరప్రసాదం. ఇది



మెదడును ప్రశాంత పరిచి గాఢ నిద్రకు దోహదపడుతుంది. అనవసరమైన భయాలు, ఆందోళనలను తగ్గించి మానసిక ధైర్యాన్ని ఇస్తుంది. మెదడులోని గ్రే మేటర్‌ను పెంచి, జ్ఞాపకశక్తిని, విశ్లేషణాత్మక సామర్థ్యాన్ని పెంచుతుంది. మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు కొత్త ఆలోచనలు, సృజనాత్మకత వెల్లివిరుస్తాయి. ధ్యానం ద్వారా మనిషి తన ఉనికిని చాటుకుంటాడు. విశ్వశక్తితో అనుసంధానం కావడం వల్ల ఒక రకమైన అతీంద్రియ ఆనందం లభిస్తుంది. ఇది మోక్ష మార్గానికి పునాదిగా పరిగణించబడుతుంది. ధ్యానం చేయడానికి పెద్ద పెద్ద ఆశ్రమాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇంట్లోనే ప్రతిరోజూ కొంత సమయం కేటాయిస్తే సరిపోతుంది. ప్రశాంతమైన, గాలి వెలుతురు వచ్చే స్థలాన్ని ఎంచుకోవాలి. బ్రాహ్మీ ముహూర్తం (ఉదయం 4 నుండి 6 గంటల మధ్య) అత్యంత ఉత్తమం. వీలుకాకపోతే సాయంత్రం కూడా చేయవచ్చు. సుఖాసనం లేదా పద్మాసనంలో వెన్నెముక నిటారుగా ఉంచి కూర్చోవాలి. కళ్ళు మూసుకుని, నెమ్మదిగా తీసుకునే శ్వాసను గమనించాలి. ఆలోచనలు వస్తున్నా వాటిని పట్టించుకోకుండా తిరిగి శ్వాసపైనే దృష్టి పెట్టాలి. చివరగా.. ధ్యానం అనేది ఒక మతానికి సంబంధించింది కాదు, అది మానవ జాతికి సంబంధించిన విద్య. ఆరోగ్యకరమైన శరీరం, ప్రశాంతమైన మనస్సు కలిగినప్పుడే మనిషి సంపూర్ణ జీవితాన్ని గడపగలడు. 'మనస్సును గెలిచినవాడు జగత్తును గెలిచినట్లే' అంటారు పెద్దలు. కాబట్టి, ప్రతిరోజూ కనీసం 15 నుండి 20 నిమిషాల పాటు ధ్యానం చేయడం అలవాటు చేసుకోవడం వల్ల ఆరోగ్యం.

**– గంగాధర్ బొమ్మకంటి**

# డిజిటల్ అరెస్టు నుంచి కాపాడుకుందాం!

సాంకేతికత ఎంతగా విస్తరిస్తోందో, నేరగాళ్లు అంతే వేగంగా కొత్త దారులను వెతుక్కుంటున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సామాన్యులను భయాందోళనకు గురిచేస్తున్న సరికొత్త సైబర్ నేరం డిజిటల్ అరెస్ట్. సీబీఐ, ఈడీ లేదా పోలీసు అధికారులమంటూ వీడియో కాల్స్ చేసి, బాధితులను గంటల తరబడి కెమెరా ముందు బందీలుగా ఉంచి లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారు. ఈ డిజిటల్ ఉచ్చు నుంచి బయటపడాలంటే భయం కంటే అవగాహనే ముఖ్యం. మీ పేరు మీద వచ్చిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని లేదా మీ ఆధార్ కార్డ్ అక్రమ లావాదేవీలకు వాడబడ్డాయని సైబర్ నేరగాళ్లు కాల్ చేస్తారు.

మిమ్మల్ని ఒక గదిలో ఒంటరిగా ఉండమని, వీడియో కాల్ కట్ చేయవద్దని, ఎవరికీ చెప్పవద్దని డిజిటల్ అరెస్ట్ చేస్తున్నట్లు బెదిరిస్తారు. నిజానికి భారతీయ చట్టాల్లో డిజిటల్ అరెస్ట్ అనే పదమే లేదు. పోలీసులు లేదా దర్యాప్తు సంస్థలు ఎప్పుడూ వీడియో కాల్ ద్వారా అరెస్టులు చేయవు. వాట్సాప్ లేదా స్కైప్ కాల్స్ ద్వారా విచారణ జరపడం చట్టవిరుద్ధం. నేరగాళ్లు మీ భయాన్ని పెట్టుబడిగా పెట్టుకుంటారు. ఏదైనా అక్రమ పార్శిల్ గురించి సమాచారం వస్తే, వెంటనే సంబంధిత కొరియర్ సంస్థను స్వయంగా సంప్రదించండి తప్ప, కాల్ చేసిన వ్యక్తి చెప్పేది నమ్మకండి. మీ ఆధార్ నంబర్, బ్యాంక్ వివరాలు, ఓటీపీ వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ షేర్ చేయవద్దు. ఏ ప్రభుత్వ సంస్థ కూడా ఫోన్‌లో డబ్బులు డిమాండ్ చేయదు. మీకు అలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా లేదా 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయండి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంచార్ సాథి వెబ్‌సైట్‌లోని 'చక్షు' సదుపాయం ద్వారా అనుమానాస్పద కాల్స్ మరియు సందేశాలను రిపోర్ట్ చేయవచ్చు. నేరగాళ్లు ఎంతటి హైటెక్ వేషధారణలో ఉన్నా, వారి లక్ష్యం మీ డబ్బు మాత్రమేనని గుర్తించాలి. తెలియని నంబర్ల నుండి వచ్చే వీడియో కాల్స్‌ను అస్సలు లిఫ్ట్ చేయవద్దు. ఒకవేళ పొరపాటున మాట్లాడినా, వెంటనే కాల్ కట్ చేసి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడం శ్రేయస్కరం.

**- విశ్వజిత్, టెక్ నిపుణుడు**




## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.